బుధవారం
16-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 144
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మరో ప్రచ్ఛన్న యుద్ధం రాకూడదు

ప్రపంచంలో మరో ప్రచ్ఛన్న యుద్ధం రాకుండా చూడటమే కాకుండా శాంతి-సుస్థిరత నెలకొల్పే దిశగా ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధాన్ని ఆపాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని జీ20 దేశాధినేతలను ఉద్దేశించి ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో అన్నారు. 2లో



సూపర్‌స్టార్ కృష్ణ ఇకలేరు

విశాలాంధ్ర- హైదరాబాద్:
ప్రముఖ సినీ నటుడు, సూపర్‌స్టార్ కృష్ణ (79) కన్నుమూశారు. కార్డియాక్ అరెస్టుకు గురైన కృష్ణను ఆదివారం అర్ధరాత్రి కుటుంబసభ్యులు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున ఆయన తుదిశ్వాస విడిచారు. కృష్ణ మృతితో ఆయన కుటుంబసభ్యులతో పాటు అభిమానులు, తెలుగు సినీలోకం శోకసంద్రంలో మునిగిపోయింది. 1942 మే 31న గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో వీరరాఘవయ్య చౌదరి, నాగరత్న దంపతులకు కృష్ణ జన్మించారు. కృష్ణ అసలు పేరు ఘట్టమనేని శివరామ కృష్ణమూర్తి. చిన్నప్పటి నుంచి ఆయనకు సినిమాలపై అమితాసక్తి ఉండేది. తల్లిదండ్రులు

'తేనెమనసులు'తో సినీప్రయాణం

మాత్రం ఆయనను ఇంజినీర్ చేయాలనుకున్నారు. సీటు దొరక్క పోవడంతో డిగ్రీలో చేరారు. చదువు కొనసాగిస్తుండగా ఏలూరులో ప్రఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావుకు ఘనంగా సన్మానం జరిగింది. ఆ కార్యక్రమానికి హాజరైన కృష్ణకు సినిమాలపై ఇష్టం మరింత పెరిగి సినీరంగం వైపు వచ్చేశారు. డిగ్రీ తర్వాత కూడా ఇంజినీరింగ్ సీటు రాకపోవడంతో కృష్ణ ఇక సినిమాలనే తన భవిష్యత్తుగా ఎంచుకున్నారు. నటులు జగ్గయ్య, గుమ్మడి, నిర్మాత చక్రపాణి తెనాలికి చెందినవారు కావడంతో కృష్ణ మద్రాసు వెళ్లి వారిని కలిశారు. వయసు తక్కువగా ఉందనీ, కొంతకాలం ఆగి వస్తే సినిమాల్లో మంచి అవకాశాలు వస్తాయని వారు సలహా ఇవ్వడంతో తిరిగి వచ్చేశారు.

ప్రజానాట్య మండలిలో చేరి గరికపాటి రాజారావు సహకారంతో పలు నాటకాల్లో నటించి నటనపై అవగాహన పెంచుకున్నారు. 1964లో ప్రముఖ దర్శక నిర్మాత ఆదుర్తి సుబ్బారావు తెరకెక్కించిన 'తేనె మనసులు' సినిమాతో కృష్ణ సినీప్రయాణం మొదలైంది. ఈ సినిమాలో కృష్ణ నటన బాగోలేదని, ఆయనను తొలగించాలని దర్శకుడిపై ఒత్తిడి వచ్చింది. అయినా ఆదుర్తి సుబ్బారావు తన నిర్ణయం మార్చుకోలేదు. 1965లో విడుదలైన ఆ సినిమా ఘన విజయం సాధించింది. 1965లో ఇందిరను కృష్ణ వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. రమేశ్‌బాబు, మహేశ్‌బాబు, పద్మావతి, ప్రియదర్శిని, మంజుల. ఆ తర్వాత సినీ నటి, దర్శకురాలు విజయనిర్మలను కృష్ణ రెండో వివాహం చేసుకున్నారు.

ఇమేజ్‌ను పెంచిన 'సాక్షి'
రెండో సినిమా 'కన్నె మనసుల్లో' నటిస్తుండగానే 'గూఢచారి 116'లో కృష్ణకు అవకాశం వచ్చింది. ఈ సినిమా అఖండ విజయం సాధించి ఆయన కెరీర్‌ను

- మిగతా 2 లో

800 కోట్లు

ఇది ప్రపంచ జనాభా

- అకాల మరణాలు తగ్గి పెరిగిన ఆయుష్షు
- ఫిలిప్పీన్స్‌లో 800వ కోట్ల శిశువు జననం
- 2037కి 900 కోట్లకు ఐరాస అంచనా

ఐరాస/న్యూఢిల్లీ:
ప్రపంచ జనాభా మంగళవారం 800 కోట్లకు చేరుకుంది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా లోని టోండోలో అక్కడి కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి 1.29 గంటలకు 800వ కోట్ల శిశువు జన్మించినట్లు ఐక్యరాజ్యసమితి (ఐరాస) వెల్లడించింది. తల్లీబిడ్డల ఫొటోలను సామాజిక మాధ్యమంలో పంచుతూ 800వ కోట్ల బిడ్డ పుట్టిందని ఫిలిప్పీన్స్ జనాభా, సంక్షేమ కమిషన్ పేర్కొంది. కాగా, 1974లో ప్రపంచ జనాభా 400కోట్లుగా ఉంటే ప్రస్తుతం రెట్టింపు అయింది. వైద్యం సహా అనేక రంగాల్లో మానవాళి సాధించిన పురోగతి వల్ల అకాల మరణాలు తగ్గి ఆయుష్షు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఐరాస తెలిపింది. 2037 నాటికి ప్రపంచ జనాభా 900 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. కేవలం 12 ఏళ్లలో జనాభా ఒక బిలియన్ (100 కోట్లు) పెరిగినట్లు ఐరాస జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ)

- మిగతా 2 లో

బోగస్ ఓట్ల కలకలం

వైసీపీ అధికార దాహం

- ఎమ్మెల్సీల గెలుపు కోసం తంటాలు
- పశ్చిమ రాయలసీమలో అత్యధికం
- నకిలీ ధృవపత్రాలతో అక్రమాలు
- అడ్డుకున్న డీఈవోలపై వేటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు అక్రమాలమయంగా మారింది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని మంత్రుల నుంచి వైసీపీ నేతల వరకు ఇష్టారాజ్యంగా బోగస్ ఓట్ల చేర్పింపులో నిమగ్నమయ్యారు. ప్రజాస్వామ్యాన్ని జగన్ ప్రభుత్వం హైజాక్ చేస్తోందని ప్రతిపక్షాలు, ఉపాధ్యాయ సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి. సాక్షాత్తూ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్...ఇటీవల వలంటీర్ల నేతృత్వంలోనే ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు ఆదేశించడం ఇందుకు బలం చేకూరుస్తోంది. గత ఎన్నికల ఓట్లతో పోలిస్తే...ఒక్కో ఎమ్మెల్సీ నియోజకవర్గంలో భారీగా బోగస్ ఓట్లు పెరగడం అనుమానాలకు తావిస్తోంది. నకిలీ ధృవపత్రాలు సృష్టించి, నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు పాల్పడుతున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఐదు ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఇందులో మూడు పట్టభద్రుల నియోజకవర్గాలు, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలున్నాయి. మార్చి/ఏప్రిల్‌లో పట్టభద్రులకు సంబంధించి ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ ఉన్నాయి. ఇప్పటివరకు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను వామపక్ష, ప్రతిపక్ష పార్టీలే అత్యధికంగా గెలుచుకున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిపైనా కన్నేసింది. స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకూ వైసీపీనే గెలవాలనే లక్ష్యంతో అధినేత, సీఎం జగన్ పావులు కదుపుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దౌర్జన్యాలకు పాల్పడటం ద్వారా వైసీపీ అత్యధిక స్థానాలను ఏకగ్రీం చేసుకుంది. పశ్చిమ రాయలసీమ, తూర్పు రాయలసీమలో భారీగా బోగస్ ఓట్లు చేర్పిస్తున్నారని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందినా...స్పందన లేదు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ నేతృత్వంలో ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఎస్టీయూ తదితర ఉపాధ్యాయ సంఘాలు బోగస్ ఓట్లను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. ఎన్నికల

- మిగతా 2 లో

ప్రైవేట్ టీచర్లతో భారీగా నమోదు

ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కొంత మంది టీచర్లతో భారీగా బోగస్ ఓట్ల నమోదుకు వైసీపీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ప్రైవేట్ ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కావాలంటే...యాజమాన్యం ఇచ్చిన అపాయింట్‌మెంట్ లేఖతోపాటు పీఎఫ్ సౌకర్యం కలిగి ఉండాలి. సంబంధిత పాఠశాలల నుంచి వేతనాలను బ్యాంకు ఖాతాల నుంచి లావాదేవీలు జరిగినట్లు రుజువు కావాలి. ఆ విద్యాసంస్థల్లో ఆరేళ్లు పనిచేసి ఉండాలి. ఇవన్నీ ఉంటేనే...ఎన్నికల నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదయ్యేందుకు అర్హులవుతారు. వాటిని అధికారులు పాటించకుండా, చాలాచోట్ల వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి బోగస్ ఓట్ల నమోదును ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు నిదర్శనం...గతంలో పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ పరిధిలో 19వేల ఓట్లు నమోదు కాగా, రాబోయే ఎన్నికలకు ఈ నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు 28 వేలకుపైగా ఓట్లు నమోదు కావడమే. ఇందులో అత్యధికంగా బోగస్ ఓటర్లే ఉన్నారని, వలంటీర్లు సైతం సర్వేల పేరుతో ఇంటింటా తిరుగుతూ అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని ఓటర్లుగా చేర్పిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

డీఈడీ కాలేజీలకు ఊరట

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా, నిబంధనలకు విరుద్ధంగా తీసుకుంటున్న నిర్ణయాలు న్యాయసమీక్షకు నిలబడలేకపోతున్నాయి. దీంతో తరచూ రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలవుతోంది. అనేక అంశాల్లో హైకోర్టు మొట్టికాయలు వేస్తున్నా అధికారుల తీరు మారడం లేదు. తాజాగా డీఈడీ కాలేజీల గుర్తింపు రద్దుపై హైకోర్టులో ఏపీ సర్కార్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఏపీలో డీఈడీ కాలేజీల గుర్తింపు రద్దుచేస్తూ ఇచ్చిన జీవోను హైకోర్టు కొట్టేసింది. 318 డీఈడీ కాలేజీల గుర్తింపు రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. రెండు పక్షాల వాదనలు విన్న హైకోర్టు ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది.

జీవో కొట్టేసిన హైకోర్టు

భవిష్యత్‌లో ఎన్‌సీటీఈ తాజా నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కాలేజీ యాజమాన్యాలు సకాలంలో సమాధానం ఇవ్వాలని హైకోర్టు సూచించింది. డీఈడీ కాలేజీలన్నీ గుర్తింపు పొందినట్టేనని హైకోర్టు పేర్కొంది.

బకాయిలు ఇవ్వకపోతే

జీఎస్‌టీ చెల్లించం

- బకాయిల కోసం అడుక్కోవాలా?
- అది బీజేపీ సొమ్ము కాదు... ప్రజల సొమ్ము: మమతా బెనర్జీ

ఝర్గ్రామ్:
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించలేకపోతే వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానాన్ని కేంద్రం తొలగించాలని అన్నారు. బకాయిల కోసం అడుక్కోవాలా అని బెనర్జీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఝర్గ్రామ్ జిల్లాలోని గిరిజనులు అధికంగా ఉండే

బెల్పహరి ప్రాంతంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం జీఎస్‌టీ బకాయిలను చెల్లించాలి లేదా ఆ పార్టీ

- మిగతా 2 లో

ముందస్తు లేదు

- షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు
- సిట్టింగ్‌లకు సీఎం అభయం
- భయం వద్దు... మరోసారి అధికారం మనదే: కేసీఆర్ 2లో

ఇదీ లోకం!

ఏం ఇవ్వన్నీ ఇళ్ళు కాదా? మీకు కళ్ళు కనపడటం లేదా?

మాజీ, సిట్టింగ్ ఎంపీలు

51 మందిపై ఈడీ కేసులు

న్యూఢిల్లీ:
51 మంది మాజీ, సిట్టింగ్ పార్లమెంటు సభ్యులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన మనీ లాండరింగ్ నిరోధక చట్టం కేసులకు సంబంధించి విచారణను ఎదుర్కొంటున్నారని సుప్రీం కోర్టు మంగళవారం తెలిపింది. 71 మంది శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు), శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీలు) కూడా మనీ లాండరింగ్ నిరోధక చట్టం-2022 కింద నిందితులుగా ఉన్నారని కూడా సుప్రీం కోర్టు ముందు సమర్పించిన ఒక నివేదిక పేర్కొంది. ఎంపీలు, ఎమ్మెల్యేల పై నేర కేసులను త్వరితగతిన పరిష్కరించాలంటూ దాఖలయిన ఒక వ్యాజ్యంలో అమికస్ క్యూరీగా నియమితులైన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా ఈ మేరకు తన నివేదికలో సుప్రీం కోర్టుకు తెలియజేశారు. మాజీ, సిట్టింగ్ సభ్యులు సహా ఎంపీలు, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దాఖలు చేసిన 121 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని స్థితి నివేదిక పేర్కొంది. కాగా చట్టసభ సభ్యులపై కేసులను త్వరగా విచారించాలని, సీబీఐ, ఇతర దర్యాప్తు సంస్థల త్వరితగతిన విచారణ జరిగేలా చూడాలని న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం ఎప్పటిక ప్పుడు ఆదేశాలు జారీ చేస్తోంది. సర్వోన్నత న్యాయస్థానం వరుస ఆదేశాలు, క్రమ పర్యవేక్షణ ఉన్నప్పటికీ, ఎంపీలు, ఎమ్మెల్యేలపై పెద్ద సంఖ్యలో నేర కేసులు ఐదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని అమికస్ సమర్పించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేర కేసులు, వాటి సత్వర పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను అందజేయాలని సుప్రీం కోర్టు గతంలో అన్ని హైకోర్టులను కోరింది. చట్ట సభ సభ్యుల పై కేసుల విచారణ జరుపుతున్న న్యాయ శాఖ అధికారులను కోర్టు ముందస్తు అనుమతి లేకుండా మార్చరాదని ఆగస్టు 10, 2021 నాటి ఉత్తర్వులను కూడా సవరించింది. గత ఏడాది ఆగస్టు 10న, సుప్రీం కోర్టు స్టేట్ ప్రాసిక్యూటర్ల అధికారాన్ని తగ్గించింది. హైకోర్టుల ముందస్తు అనుమతి లేకుండా నేర శిక్షా స్మృతి (సీఆర్‌పీసీ) కింద చట్టసభ సభ్యుల పై విచారణను ఉపసంహరించుకోలేమని తీర్పు ఇచ్చింది. కేంద్రం, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు అవసరమైన స్థితి నివేదికలను దాఖలు చేయక పోవడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. రాజకీయ నాయకుల పై నేర కేసులను పర్యవేక్షించడానికి ఉన్నత న్యాయస్థానంలో ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేయాలని సూచించింది.

71 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కూడా: సుప్రీం కోర్టు

ఫాసిస్టు హిందూత్వ దేశమే బీజేపీ లక్ష్యం

- కేరళ రాజ్‌భవన్‌కు ఎల్డీఎఫ్ మార్చ్- ధర్నా
- గవర్నర్‌కు వ్యతిరేకంగా వామపక్ష పోరాటం: మద్దతిచ్చిన డీఎంకే
- కేరళ వర్సిటీల్లో పనితీరుపై మారని ఖాన్ తీరు

తిరువనంతపురం:
ఫాసిస్టు హిందూత్వ దేశాన్ని స్థాపించే లక్ష్యంగా బీజేపీ-ఆర్ఎస్ఎస్ అడుగులు వేస్తున్నాయని, ఇందుకోసం తమ పార్టీ అధికారంలో లేని రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గవర్నర్ వ్యవస్థను అస్త్రంగా వినియోగిస్తూ వివాదాలు సృష్టించి పరిపాలనను అస్థవ్యస్థం చేస్తున్నాయని వామపక్ష నాయకులు విమర్శించారు. విద్యా కాషాయీకరణే ధ్యేయంగా వ్యవహారం ఉన్నదని దుయ్యబట్టారు. పసిమనస్సుల్లో కాషాయ విషబీజం నాటుతూ వారి మదిలో మతతత్వవాదాన్ని నూరిపోసి లౌకిక-ప్రజాస్వామ్యబద్ధ భారత్‌ను హిందూత్వ దేశంగా మార్చేందుకు విద్యావ్యవస్థపై పూర్తి నియంత్రణకు కేంద్రం యత్నిస్తోందని విమర్శించారు. ఇలాంటి చర్యలను సహించేది లేదని కేరళ వామపక్ష నేతలు తేల్చిచెప్పారు. గవర్నర్ ఆరీఫ్ మహమ్మద్ ఖాన్ తీరుకు వ్యతిరేకంగా వీధి పోరాటానికి సిద్ధమైన ఎల్డీఎఫ్ వర్గాలు మంగళవారం రాజ్‌భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. రాజ్‌భవన్ ఎదుట ధర్నాలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు రాష్ట్ర వామపక్ష నాయకులు, డీఎంకే నాయకులు పాల్గొన్నారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో బీజేపీ-ఆర్ఎస్ఎస్ అజెండా అమలు దిశగా యూనివర్సిటీలను మాధ్యమాలుగా చేసుకొని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గవర్నర్ కార్యాలయాన్ని వినియోగిస్తున్నారని నాయకులు విమర్శించారు. డీఎంకే ఎంపీ తిరుచీ శివ ధర్నాలో

- మిగతా 2 లో

ప్రపంచశాంతికి

సమష్టి కృషి

- ఇంధన సరఫరాపై ఆంక్షలు వద్దు
- ఉక్రెయిన్‌లో దౌత్యం, కాల్పుల విరమణ అవశ్యం
- ఎరువుల కొరతతోనే ఆహార సంక్షోభం
- నిత్యావసరాల సంక్షోభాల పరిష్కారంలో ఐరాస విఫలం
- జీ20 సదస్సులో ప్రధాని మోదీ

బాలీ:
ఉక్రెయిన్‌లో దౌత్యం, కాల్పుల విరమణకు మార్గాన్ని అన్వేషించడం అవసరమని భారత ప్రధాని నరేంద్రమోదీ జీ20 సదస్సులో నొక్కి చెప్పారు. ఇంధన సరఫరాలపై ఆంక్షలను ప్రోత్సహించకూడదని, ఇంధన మార్కెట్‌లో స్థిరత్వాన్ని నెలకొల్పాలని సూచించారు. పునరుత్పాదక ఇంధనం, పర్యావరణ పరిరక్షణకు

- మిగతా 2 లో

కంబోడియా ప్రధానికి కోవిడ్ పాజిటివ్

నుసాదువా: కంబోడియా ప్రధాని హున్ సేన్‌కు కోవిడ్ సోకినట్లు బాలీ అధికారులు మంగళవారం ప్రకటించారు. దీంతో జీ20తో పాటు బ్యాంగ్ కాంక్‌లో ఎపెక్ ఆర్థిక ఫోరం సదస్సు క్రమంలో తన అన్ని సమావేశాలను రద్దు చేసుకున్నట్లు వెల్లడించారు. ఇటీవల తమ దేశంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో పాటు మరికొందరితో ఆయన సదస్సు నిర్వహించారు. ఈ క్రమంలో అమెరికా వ్యాధి నిరోధక కేంద్రాల సూచనలమేరకు బైడెన్‌ను క్లోజ్‌కాంటాక్ట్‌గా భావించి పరీక్షించగా కోవిడ్ నెగిటివ్‌గా నిర్ధారణ అయిందని శ్వేతసౌధం ప్రకటించింది. శనివారం ఇద్దరు నాయకులు కలిసి ఉన్నారుగానీ పక్క పక్కనే కూర్చోలేదు. కంబోడియా ప్రధాని ఆతిథ్యాన్ని అందుకున్న అధినాయకుల్లో బైడెన్‌తో పాటు చైనా, జపాన్, కెనడా ప్రధాని లి కియాంగ్, ఫుమియో కిషిదా, జస్టిన్ ట్రుడ్యూ, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రో తదితరులు ఉన్నారు.

మరో ప్రచ్ఛన్న యుద్ధం రాకూడదు

- ఉక్రెయిన్-రష్యా పోరాటాన్ని ఆపాలి
- జీ20 ప్రారంభోపన్యాసంలో జోకో విడోడో

నుసాదువా: ప్రపంచంలో మరో ప్రచ్ఛన్న యుద్ధం రాకుండా చూడటమే కాకుండా శాంతి-సుస్థిరత నెలకొల్పే దిశగా ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధాన్ని ఆపాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని జీ20 దేశాధినేతలనుద్దేశించి ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో అన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు సమష్టి కృషి, పటిష్ఠ చర్యలు, ఐక్య కార్యాచరణ అవశ్యమని సూచించారు. జీ20 శిఖరాగ్ర సమావేశాలు మంగళవారం ఇండోనేసియా రాజధాని బాలీలో ప్రారంభమయ్యాయి. ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధానికి అంతం పలికాలని, ఇందుకోసం ఐరాస చార్టర్‌ను అనుసరించడం ప్రతి దేశాధినేత బాధ్యత అని విడోడో నొక్కి చెప్పారు. బాధ్యతాయుతంగా ఉండటం అంటే అర్థం యుద్ధానికి మనం ముగింపు పలకడమేనని స్వాగతోపన్యా సంలో ఆయన అన్నారు. ప్రపంచం మరో ప్రచ్ఛన్న యుద్ధం దిశగా అడుగులు వేసే పరిస్థితి దాపురిస్తుందని హెచ్చరించారు. దానిని నివారించడం మనందరి కర్తవ్యమన్నారు. ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం అంతానికి అన్ని దేశాలు ఆకాంక్షించగా, ఇందుకోసం జీ20 సదస్సు ముసాయిదా తీర్మానాన్ని తీసుకు వచ్చినట్లు సమాచారం. బ్రిటన్ ప్రధాని రిషిసునాక్ ఉక్రెయిన్‌కు మద్దతు ప్రకటించారు. 'ఉక్రెయిన్‌ను వీడండి' అని రష్యా సీనియర్ అధికారి సెర్గీని ఉద్దేశించి సునాక్ వ్యాఖ్యానించారు.

యుద్ధం అంతం కావాలి: జెలెన్స్కీ

ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ వీడియో లింక్ ద్వారా ప్రసంగిస్తూ రష్యా వినాశకార యుద్ధాన్ని ముగించాల్సిన సమయం ఆసన్నమైందని భావిస్తున్నానని అన్నారు. అణు-ఆహార భద్రతకు అనుసరిస్తున్న వ్యూహాలను వెల్లడించారు. పరిస్థితులు మరింత జటిలం కాకుండా ఉద్రిక్తతల నివారణకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. రష్యాను మినహాయిస్తూ 'జీ19' నాయకులంటూ సభను సంబోధించారు. ప్రధానంగా 'బ్లాక్ సీ గ్రెయిన్ ఇనిషియేటివ్' (త్వరలోనే ముగియనున్న ధాన్యం ఎగుమతి ఒప్పందం)ను పొడిగించాలని కోరారు. ఈ ఒప్పందం నవంబరు 19 (శనివారం)తో ముగియనుంది.

అంతర్జాతీయ సవాళ్లను సమిష్టిగా ఎదుర్కొందాం: జిన్‌పింగ్

అన్ని సవాళ్లను సమిష్టిగా ఎదుర్కొందామని జీ20 దేశాలనుద్దేశించి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. నేడు ప్రపంచం అనేక సవాళ్ల సుడిగుండంలో చిక్కుకొని ఉన్నదని, ఈ పరిస్థితులు ప్రపంచ దేశాలు ఒక వర్గంగా కలిసికట్టుగా ముందుకు సాగాలని, మానవాళి భవిష్యత్ కోసం కమ్యూనిటీ విజన్‌ను అనుసరించాలని, శాంతి, అభివృద్ధిని ప్రోత్సహిస్తూ అందరికి ప్రయోజనం చేకూరే విధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్ని దేశాల అభివృద్ధికి ప్రోత్సాహం అందించాలని, మానవాళి శ్రేయస్సు దృష్ట్యా చర్యలు తీసుకోవాలని, మొత్తం ప్రపంచం పురోగతి సాధించే విధంగా ముందుకెళ్లాలని సూచించారు. ఇదే క్రమంలో ఆయన మూడు అంశాల ప్రతిపాదన చేశారు. 'కలిసి కోలుకుందాం.. మరింత శక్తిమంతంగా తయారవుదామన్న' బాలీ సదస్సు థీమ్ ఎంతో సానుకూలమైన సందేశమిస్తోందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యం కీలకమని జిన్‌పింగ్ అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న కష్టాలు-సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆపన్న హస్తాన్ని అందించాలన్నారు. జీ20లో ఆఫ్రికా యూనియన్ చేరడాన్ని చైనా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కోవిడ్-19పై పోరులో అంతర్జాతీయ సహకారాన్ని మరింతగా అందించాలని అన్ని దేశాలను జిన్‌పింగ్ కోరారు. తద్వారా ఆర్థిక వ్యవస్థ కోలుకునేందుకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పగలమని ఆకాంక్షించారు. అంతర్జాతీయద్రవ్యోల్బణం, వ్యవస్థాగత ఆర్థిక సవాళ్లను కలిసి పరిష్కరిద్దామని పిలుపునిచ్చారు.

అరకు అందాలకు 'వలిసె'ల సొగసులు

విశాలాంధ్ర-అరకులోయ (అల్లూరి జిల్లా): ప్రముఖ పర్యాటక కేంద్రమైన అందాల అరకులోయలో వలిసె పువ్వుల అందాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ఈ సీజన్లో గిరి రైతులు వాణిజ్య సాగుగా పండించే వలిసేపూల తోటలు అరకు లోయ అందాలకు ఎంతగానో వన్నె తెస్తున్నాయి. ప్రకృతి సహజ సిద్ధంగా వెలసిన అందాలకు వలిసెల సొగసులు తోడవడంతో అరకులోయ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. అరకు సందర్శనకు తరలి వచ్చే పర్యాటకులు ఈ అందాలను తిలకించి అబ్బుర పడుతున్నారు. పసుపు చీర కట్టిన పడతిలా ఎటు చూసిన పసుపు పచ్చని వలిసె పూల తోటలు చూడచక్కగా కనిపించడంతో పర్యాటకులు ఆహ్లాదభరితులవుతున్నారు. రహదారికి రెండువైపులా ఉన్న వలిసె పూలతోటలో ఫొటోలు దిగుతూ సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు. వలస పూల తోటలు గిరి రైతుల ఆర్థిక అభివృద్ధి దోహదపడటం కాకుండా అరకులోయ అందాలకు సరికొత్త హంగులు అద్దుతున్నాయి. అటు రైతులకు ఆర్థిక బాట వేస్తూ ఇటు వరకు అందాలకు కొత్త వన్నెలు తెస్తూ పర్యాటకులను మైమరపిస్తూ బహుళ ప్రయోజనాలు కలిగిస్తున్నాయి. అరకు అందాలను వీక్షించాలంటే నవంబర్ డిసెంబర్ మాసాల్లో తప్పనిసరిగా పర్యటించాలని అనేక ప్రాంతాల నుండి వచ్చిన పర్యాటకులు చెప్పుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా డిసెంబర్ ప్రథమార్థం వరకు మాత్రమే వలిసె పూల సొగసులు పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి.

చిట్‌ఫండ్, ఫైనాన్స్ సంస్థల్లో విస్తృత సోదాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖాధికారులు వివిధ చిట్‌ఫండ్, ఫైనాన్స్ సంస్థల్లో విస్తృత సోదాలు నిర్వహించారు. చిట్‌ఫండ్స్ కంపెనీల్లో అతిపెద్ద కంపెనీగా పేరొందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్‌తో సహా దాదాపు రాష్ట్రంలో 18 చిట్‌ఫండ్ సంస్థల్లో రిజిస్ట్రేషన్ శాఖ తనిఖీలు నిర్వహించింది. 2021-22 మధ్య చిట్స్ మొత్తాలను మళ్లించినట్లు గుర్తించిన అధికారులు ఈ సోదాలు చేపట్టారు. బ్యాలెన్స్ షీట్లను లోతుగా పరిశీలించిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సెక్షన్ 31కి వ్యతిరేకంగా ఖాతాదారుల నుంచి ముందస్తు పద్ధతిలో డబ్బు వసూలు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. 5 శాతం వడ్డీ చెల్లిస్తామంటూ చిట్‌ఫండ్ సంస్థలు ఎర వేస్తున్నాయని, ఖాతాదారుల నుంచి వసూలు చేసిన అపరాధ రుసుముపై జీఎస్‌టీ ప్రభుత్వానికి ఎగవేస్తున్నారని, ఖాతాదారుల డబ్బులకు ఎలాంటి భరోసా ఇవ్వడం లేదనే ఆరోపణలపై అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం.

ఐరాస తీర్మానం-ఓటింగ్‌కు భారత్ దూరం

ఐరాస: పరిహారం ఇవ్వడం వల్ల సమస్య/వివాదం పరిష్కార పద్ధతులకు పరిహారం విధానం దోహదమవుతుందా? అని ఐక్యరాజ్యసమితి (ఐరాస)ని భారత్ ప్రశ్నించింది. ఉక్రెయిన్‌కు రష్యా నష్టపరిహారం చెల్లించాలని ఐరాస సార్వత్రిక సమావేశం తీర్మానించగా దీనిపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. మొత్తం 193 యూఎన్‌జీఏ సభ్యులు ఉంటే తీర్మానానికి 94 అనుకూల ఓట్లు, 14 వ్యతిరేక ఓట్లు వచ్చాయి. 73 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఓటింగ్‌కు దూరంగా ఉన్న దేశాల్లో భారత్, బంగ్లాదేశ్, భూటాన్, బ్రెజిల్, ఈజిప్టు, ఇండోనేసియా, ఇజ్రాయిల్, నేపాల్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక ఉన్నాయి. వ్యతిరేకంగా ఓటు వేసిన దేశాల్లో చైనా, బెలారస్, క్యూబా, ఉత్తర కొరియా, ఇరాన్, రష్యా, సిరియా ఉన్నాయి.

800 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ట్వీట్ చేసింది. ప్రపంచంలోనే అధిక జనాభాగల చైనాను వెనక్కినెట్టి భారత్ ఆ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు వెల్లడించింది. 1804లో ప్రపంచ జనాభా వంద కోట్లకు చేరింది. పారిశ్రామిక విప్లవంతో ఆర్థిక పురోభివృద్ధి ఊపందుకుని, వైద్యంలో పురోగతి వల్ల శిశువుల్లో అకాల మరణాలు తగ్గుముఖం పట్టాయి. ప్రపంచ జనాభా 200 కోట్లకు చేరడానికి 126 ఏళ్లు (1930లో) పట్టగా 300 కోట్ల మార్కుకు చేరడానికి 30 ఏళ్లు (1960) పట్టాయి. ఆ తర్వాత 14 ఏళ్లు (1974)కు 400 కోట్ల స్థాయికి ప్రపంచ జనాభా చేరింది. 500 కోట్ల మార్కును తాకడానికి 13 ఏళ్లు (1987) పట్టింది. 600 కోట్ల స్థాయిని చాలా వేగంగా 11 ఏళ్లలోనే (1998) చేరుకోగా 700 కోట్లని తాకడానికి 12 ఏళ్లు (2010) పట్టింది. 12 ఏళ్లకు (నవంబరు 15, 2022) 800కోట్ల మార్కును తాకింది. 2023కి చైనాను అధిగమించి ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ జనాభా కలిగిని దేశంగా భారత్ నిలుస్తుందని ఐరాస అంచనా వేస్తోంది. ప్రస్తుతం భారతదేశ జనభా 141.2కోట్లుగా ఉంటే 2050కి 170 కోట్లకు చేరుకోవచ్చు అని, చైనా జనాభా 145.2కోట్లు ఉంటే 2050కల్లా 130 కోట్లకు తగ్గవచ్చని ఐరాస వెల్లడించింది.

ఇది భారత్‌కు సదవకాశం: నిపుణులు

ప్రపంచ జనాభా 800కోట్లకు చేరుకోవడం భారత్‌కు సదవకాశంగా నిపుణులు తెలిపారు. ఈక్విటీ, ఈక్వాలిటీపై ప్రధానంగా దృష్టి పెడుతూనే వృద్ధ జనాభా సంరక్షణకూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ది పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) స్పందిస్తూ 'మొత్తం 800 కోట్ల మందికి ఆరోగ్య-ఆహ్లాదకర జీవితాన్ని కల్పించేందుకు మెరుగైన ప్రణాళికతో ముందుకు వచ్చేందుకు ఈ మైలురాయి భారత్‌కు సదవకాశంగా చెప్పవచ్చు' అని పేర్కొంది. పీఎఫ్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనం ముత్రేజా మాట్లాడుతూ, 'ప్రపంచవ్యాప్తంగా జనాభావృద్ధి స్థిరంగా ఉంది. జనాభా ఏడు బిలియన్ల నుంచి ఎనిమిది బిలియన్లకు చేరుకోవడానికి 12 ఏళ్లు పట్టింది. 2037కి అంటే 15 ఏళ్లలో ఇది తొమ్మిది బిలియన్లకు చేరుకోనుంది. దీనినిబట్టి జనాభా వృద్ధి నెమ్మదిస్తోందని తెలుస్తోంది. దీంతో జనాభా నియంత్రణపై దృష్టిని కేంద్రీకరించాలి. సంతానం కావాలా.. ఎంత మంది పిల్లలు కావాలి, వారి మధ్య ఎంత తేడా ఉండాలి వంటి వాటిపై నిర్ణయాధికారం మహిళలకు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

బోగస్ ఓట్ల కలకలం

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.

నెల్లూరు, అనంతపురం డీఈవోలపై వేటు

బోగస్ ఓట్ల చేర్పింపునకు సహకరించడం లేదనే అక్కసుతో నెల్లూరు, అనంతపురం డీఈవోలపై ప్రభుత్వం వేటు వేసింది. ఎన్నికల్లో అక్రమాలకు సహకరించనందునే వారిని అక్రమంగా బదిలీ చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. కర్నూలు, కడప, అన్నమయ్య జిల్లాల్లో భారీగా బోగస్ ఓట్లు నమోదైనట్లు సమాచారం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను జగన్ ప్రభుత్వం పూర్తిగా రాజకీయంగా మార్చేసింది. చాలా సంవత్సరాలుగా శాసనమండలికి ఉపాధ్యాయ, పట్టభద్రుల నుంచి ఆయా రంగాల్లో నిష్ణాతులు ఎన్నికవుతున్నారు. వారంతా శాసనమండలిలో సంపూర్ణ అవగాహనతో ప్రసంగించి, వివిధ చట్టాల రూపకల్పన, సమస్యల పరిష్కారంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ ఎన్నికలను జగన్ ప్రభుత్వం పార్టీపరంగా భావించి, వైసీపీ నేతలనే బరిలోకి దించనుంది. ఇప్పటికీ శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ఎక్కువగా ఉన్నారు. వారిలో చాలామందికి చట్టసభలపై అవగాహన లేదు. కొందరు మొక్కుబడిగానే సమావేశాలకు హాజరవుతున్నారు. మరికొందరు వచ్చినా మౌనంగా సీట్లకు పరిమితమవుతున్నారు. ఎన్నికల అధికారులు స్పందించి ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదులో బోగస్ ఓట్లను అరికట్టి, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరముంది.

మోదీ మెప్పుకోసమే విశాఖ సభ

పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత అవసరాలే ముఖ్యంగా మారాయని, విశాఖలో మోదీ మెప్పు కోసం ప్రభుత్వం సభ పెట్టిందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలపై మాట్లాడే వాళ్లు, ఆలోచించే పార్టీ అంటూ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రానికి సంబం ధించి బీజేపీ, జనసేన వాళ్లకి తెలియని సమాచారమంతా వైసీపీ దగ్గర ఉంటోందన్నారు. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న ఎంపీ విజయసాయిరెడ్డి దగ్గర మరింత సమాచారం ఉంటోందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మోదీ, జగన్‌లు ఓ రహస్య ఎజెండాతో వెళ్తూ...మరో ఎజెండాను బహిరంగంగా మన ముందు పెడుతున్నారనే అనుమానాలు ఉన్నాయనీ, తాజాగా విశాఖలో జరిగిన సభతో అది నిర్ధారణ అయిందన్నారు. రాష్ట్రానికి మేలు జరగాలంటే బీజేపీ దుర్మార్గాన్ని అడ్డుకోవాలని, అది కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలో మోదీ ఏ విధంగా అయితే రాజ్యాంగ వ్యవస్థల్ని తుంగలో తొక్కారో, రాష్ట్రంలోనూ జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రజా ప్రతిఘటన తప్పదని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడం కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందన్నారు. డిసెంబర్‌లో పాదయాత్ర చేపడతామని, అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు ఈ యాత్ర సాగుతుందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పరసా రాజీవ్‌రతన్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు లేదు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వస్తాయని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం కేసీఆర్ అన్నారు. టీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధతతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం అసెంబ్లీ ఎన్నికలపై స్పష్టత ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని కేసీఆర్ స్పష్టం చేశారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పార్టీ శ్రేణులంతా ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను మార్చే ప్రసక్తే లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ పాత వారికే టికెట్లు ఇస్తామని పేర్కొన్నారు. ఎన్నికలకు పది నెలల సమయమే ఉంది.... ప్రతి ఎమ్మెల్యే నిత్యం ప్రజలతో మాట్లాడాలి అని సూచించారు. ఏవైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తేవాలని అన్నారు. సర్వేలన్ని టీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. వంద శాతం మళ్లీ టీఆర్ఎస్‌దే అధికారమని తేల్చిచెప్పారు. మునుగోడు తరహాలో పటిష్ట ఎన్నికల వ్యూహం తయారు చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యేలు, కార్యకర్తలు నిత్యం ప్రజలతో మమేకం కావాలన్నారు. వారితో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

బీజేపీతో మన పోరాటం ఆగదు...

బీజేపీ నుంచి ఎదురయ్యే దాడిని సమర్థంగా తిప్పికొట్టాలి... బీజేపీతో పోరాడాల్సిందేనని కేసీఆర్ చెప్పారు. ప్రభుత్వాలను కూలగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు... మన దగ్గర కూడా ప్రయత్నించి అడ్డంగా దొరికారు... ఆ పార్టీ కుట్రలన్నింటినీ తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో చట్టం తన పని తాను చేస్తోందని తెలిపారు. సీబీఐ, ఈడీ దాడులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

నా కూతుర్ని పార్టీ మారమని అడిగారు...

తన కూతురు కల్వకుంట్ల కవితను పార్టీ మారమని బీజేపీ నేతలు అడిగారని, ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేమైనా ఉందా అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీలపై బీజేపీ సర్కార్ కుట్రలు చేస్తోందని కేసీఆర్ ఆరోపించారు. కేంద్రానికి ఏపీ సీఎం జగన్ అనుకూలంగా ఉన్నా వైసీపీని దెబ్బతీసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందన్నారు. ఎమ్మెల్యేలపై పార్టీ మారాలని ఒత్తిడి చేస్తున్నారని, ఎవరెవరు ఏం చేస్తున్నారో ఎవరితో మాట్లాడుతున్నారో తనకు అన్నీ తెలుసని, జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్ హెచ్చరించారు. ఎవరూ బీజేపీకి లొంగవద్దని, సమావేశ వివరాలు బయటకు చెప్పొద్దని నేతలకు స్పష్టం చేశారు. అందరిపై నిఘా ఉందని కేసీఆర్ చెప్పారు. మునుగోడు ఫలితాలపై కూడా సమీక్ష జరిపారు. సరిగ్గా పనిచేయని మంత్రులకు హితబోధ చేశారు.

జీఎస్‌టీ చెల్లించం

(మొదటిపేజీ తరువాయి)

అధికార పీఠం నుంచి తప్పుకోవాలని అన్నారు. 'ఎంఎన్‌ఆర్‌ఈజీఏ పథకం కింద నిధులు విడుదల చేయడం లేదు. మా బకాయిలు చెల్లించకుంటే బీజేపీ అధికారం నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. రాష్ట్ర బకాయిలను చెల్లించకపోతే కేంద్రం తప్పని సరిగా జీఎస్‌టీని రద్దు చేయాలి. మాకు జీఎస్‌టీ బకాయిలు ఇవ్వడం ద్వారా వారు మాకు ఎలాంటి మేలు చేయడం లేదు. వారు జీఎస్‌టీ ద్వారా తీసుకున్నది ప్రజల సొమ్ము' అని గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతి కార్యక్రమంలో ఆమె అన్నారు. తాను ప్రధాని నరేంద్ర మోదీని కూడా కలిసి విషయాన్ని ప్రస్తావించానని బెనర్జీ తెలిపారు. 'మేము జీఎస్‌టీని అమలు చేయడానికి అంగీకరించాం. కేంద్రం మా బకాయిలను చెల్లిస్తుందని అనుకున్నాం. కానీ ఇప్పుడు కేంద్రం జీఎస్‌టీగా వసూలు చేసిన డబ్బును మాకే ఇవ్వడం లేదు. నేను ప్రధానిని కలిశాను, అభ్యర్థించాను, కానీ ఏదీ ముందుకు సాగలేదు. దానికోసం మనం అడుక్కోవాలా? కేంద్రం మా బకాయిలు చెల్లించకపోతే మనం జీఎస్‌టీని ఎందుకు చెల్లించాలి? కేంద్రం డబ్బులు ఇవ్వలేకపోతే మనం కూడా జీఎస్‌టీని కట్టడం మానేస్తాం. దేశం ప్రజల కోసం, రాజకీయ నాయకుల కోసం కాదు. ఇది బీజేపీ సొమ్ము కాదు' అని ఆమె అన్నారు. పథకాలను ప్రస్తావిస్తూ, 'దీని కింద నిధులు నిలిపివేయబడ్డాయి' అని బెనర్జీ పేర్కొంటూ, 100 రోజుల పని పథకానికి రాష్ట్రానికి చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా కట్టుబడి ఉందని అన్నారు. '100 రోజుల పని పథకానికి నిధులు విడుదల చేయడం రాజ్యాంగబద్ధమని నేను కేంద్ర ప్రభుత్వానికి చెప్పాలనుకుంటున్నాను. కేంద్రం చెల్లించాలి' అని అన్నారు. తర్వాత స్థానికులతో సంభాషించిన మమతా బెనర్జీ, జల్ జీవన్ మిషన్ కింద పైప్‌డ్ వాటర్ ప్రాజెక్టు ఆగిపోవడానికి కేంద్ర నిధుల కొరత ప్రధాన కారణమని తెలిపారు. '2024 నాటికి అన్ని ఇళ్లకు పైపుల ద్వారా తాగునీరు అందించాలి. కానీ కేంద్రం నిధులు ఇవ్వడం మానేసింది. అందుకే ప్రాజెక్టు ఆగిపోయింది. వారు చెల్లిం చిన తర్వాత, మేము దానిని అమలు చేయడం ప్రారంభి స్తాము. కేంద్రం చేసిన అన్యాయంపై పోరాడుతున్నాం' అని అన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ ఇకలేరు

(మొదటిపేజీ తరువాయి)

మలుపుతిప్పింది. తెలుగు ప్రేక్షకులు ముద్దుగా ఆయనను ఆంధ్రా జేమ్స్‌బాండ్‌గా పిలుచుకునేవారు. ఈ విజయంతో కృష్ణ ఏకంగా 20 సినిమాలకు హీరోగా ఎంపికయ్యారు. ఆయన ఇమేజ్ అమాంతం పెరగడమే గాక... ఆ తర్వాత రెండు దశాబ్దాల్లో ఆయన మరో ఆరు జేమ్స్‌బాండ్ తరహా చిత్రాలు చేశారు. అవన్నీ ఆయనకు విజయాన్ని తెచ్చిపెట్టాయి. బాపు తీసిన పూర్తి అవుట్ డోర్ చిత్రం 'సాక్షి' కృష్ణ ఇమేజ్‌ను పెంచింది. మానవత్వం మీద నమ్మకంగల పల్లెటూరి అమాయకుడి పాత్రలో నటించి మెప్పించిన చిత్రమిది. విజయనిర్మలతో నటించిన మొదటిచిత్రం కూడా ఇదే. ఒక ఏడాదిలో పదుల సంఖ్యలో ఆయన సినిమాలు విడుదలయ్యేవి. 1968లో కృష్ణ నటించిన 10 సినిమాలు విడుదలయ్యాయి. ఆ తర్వాత 1969లో 15 సినిమాలు, 1970లో 16 చిత్రాలు, 1971లో 11 సినిమాలు, 1972లో 18 సినిమాలు, 1973లో 15 చిత్రాలు, 1974లో 13, 1980లో 17 సినిమాలు విడుదలయ్యాయి. ఒక దశలో కృష్ణ రోజుకు మూడు షిఫ్టుల్లో పనిచేసేవారు.

340 సినిమాలకు పైగా...

నాలుగు దశాబ్దాల పాటు సాగిన సినీ కెరీర్‌లో కృష్ణ 340కు పైగా సినిమాల్లో నటించారు. ఎన్నో సాహసాలు చేసిన కృష్ణ 'డేరింగ్ అండ్ డాషింగ్' హీరోగా పేరుతెచ్చుకున్నారు. 1970లో పద్మాలయా పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించి విజయవంతమైన చిత్రాలు తీశారు. దర్శకుడిగానూ 16 సినిమాలు తెరకెక్కించారు. తెలుగులో తొలి జేమ్స్‌బాండ్ సినిమా గూఢచారి 116, తొలి కౌబాయ్ సినిమా మోసగాళ్ళకు మోసగాడు, తొలి ఫుల్‌స్కోప్ సినిమా అల్లూరి సీతారామరాజు, తొలి 70 ఎంఎం సినిమా సింహాసనం ఆయన సినిమాలే.

రాజీవ్‌గాంధీ స్నేహంతో రాజకీయాల్లోకి

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, కృష్ణకు సన్నిహితులు. ఆ అభిమానంతోనే 1984లో కృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1991 ఎన్నికల్లో మరోసారి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత రాజీవ్ గాంధీ హత్యకు గురవడం, ఓటమితో కృష్ణ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే కాంగ్రెస్‌లో చేరిన తర్వాత ఎన్టీఆర్ (టీడీపీ) ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పలు సినిమాలు చేశారు. 2010 తర్వాత క్రమంగా సినిమాల నుంచి విరామం తీసుకున్నారు. 2016లో వచ్చిన 'శ్రీ శ్రీ' కృష్ణ నటించిన చివరి చిత్రం. సినీరంగంలో విశేష సేవలందించిన కృష్ణకు ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం (1997), ఎన్టీఆర్ జాతీయ పురస్కారం (2003), ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (2008), పద్మభూషణ్ పురస్కారం (2009) లభించాయి. కృష్ణ భౌతికకాయానికి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఫాసిస్టు హిందూత్వ దేశమే బీజేపీ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొని వామపక్ష ప్రభుత్వ పోరాటానికి మద్దతు తెలిపారు. తమిళనాడులోనూ ఇదే తరహా పరిస్థితులు ఉన్న విషయం విదితమే. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రసంగిస్తూ బీజేపీయేతర పాలిత రాష్ట్రాలన్నింటిలోనూ కేరళలో వలె ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య ఘర్షణ కొనసాగుతు న్నట్లు తెలిపారు. 'రాష్ట్ర ప్రభుత్వ చర్యలను గవర్నర్ కార్యాలయం తిరస్కరిస్తోంది. వీసీల నియామకాలు చట్టబద్ధంగా జరిగినా అక్రమైనవిగానే చెబుతోంది. విద్యావ్యవస్థపై నియంత్రణ బీజేపీ-ఆర్ఎస్ఎస్ రాజకీయ డిజైన్‌లో కీలకాంశం. విద్యావ్యవస్థపై పట్టు సాధించడం ద్వారా ఫాసిస్టు హిందూత్వ దేశంగా ప్రజాస్వామ్యబద్ధ లౌకిక భారతదేశాన్ని మార్చవచ్చునని కాషాయ వర్గం భావిస్తోంది. యువతకు మతోన్మాదాన్ని విద్యార్థిదశ నుంచే నూరిపోస్తోంది. వారి ఆలోచనలను నియంత్రించాలని బీజేపీ-ఆర్ఎస్ఎస్ కోరుకుంటున్నాయి' అని ఏచూరి విమర్శించారు. రాజ్యాంగబద్ధ అత్యున్నత పదవిగా ఉన్న గవర్నర్‌ను రాజకీయ దురుద్దేశాల కోసం వినియోగించే పదవి స్థాయికి దిగజార్చిన ఘనత బీజేపీదేనని దుయ్యబట్టారు. యూజీసీ నిబంధనలపై తగిన విధంగా సమీక్షించాలని ఏచూరి అన్నారు. విశ్వవిద్యాలయాల చాన్సలర్‌గా గవర్నర్‌కు బాధ్యతలు చట్టప్రకారమే దక్కుతాయని నొక్కిచెప్పారు. సీపీఐ - సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కన్నం రాజేంద్ర, ఎంవీ గోవిందన్ మాట్లాడుతూ రాష్ట్ర విశ్వవిద్యాలయాల చాన్సలర్‌గా ఖాన్‌ను కొనసాగించే ఉద్దేశం వామపక్ష ప్రభుత్వానికి లేదని తేల్చిచెప్పారు. గవర్నర్ ఖాన్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ఎవరి హద్దులో వారు ఉంటే ప్రభుత్వానికి, తనకు మధ్య ఘర్షణ ఉండదని అన్నారు. విశ్వవిద్యాలయాలను అధికారపార్టీ శాఖలుగా మారుస్తామంటే అంగీకరించేది లేదని చెప్పారు. గతేడాది వరకు కేరళలో 13 విశ్వవిద్యాలయాలు ఉండేవి, వాటిలో జరిగిన వీసీ నియామకాలన్నీ అక్రమమైనవి. మరే రాష్ట్రంలోనైనా ఇలా జరిగిందా? విశ్వవిద్యాలయాలు అధికార పార్టీ కేడర్, వారి బంధువుల సొత్తుగా మారాయి' అని ఆరోపించారు. ఇదిలావుంటే, ఎల్డీఎఫ్ ప్రదర్శనను కాంగ్రెస్, బీజేపీ వ్యతిరేకించాయి.

ప్రపంచశాంతికి సమష్టి కృషి

(మొదటిపేజీ తరువాయి)

భారత్ కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ప్రపంచ శాంతికి సమష్టిగా కృషిచేద్దామని సభ్యదేశాలకు ఆయన పిలుపునిచ్చారు. ఎరువులు, ధాన్యాల సరఫరా వ్యవస్థ స్థిరంగా కొనసాగేలా అన్ని దేశాలు పరస్పర ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని సూచించారు. ప్రపంచంలో చాలాచోట్ల ఆహార, ఆర్థిక సంక్షోభాలు ఉన్నందున చాలామంది క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, వీటిని పరిష్కరించడంలో ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలు విఫలమవుతున్నాయని చెప్పేందుకు సంకోచించరాదని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆకలి కేకలు, పోషకాహార లోపాలను తృణధాన్యాలు పరిష్కరించగలవని చెప్పారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరాన్ని ఉత్సాహంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇంధన సరఫరా సవాళ్లు, సుస్థిరాభివృద్ధి, ఉక్రెయిన్ యుద్ధం, కోవిడ్ మహమ్మారి, వాతావరణ మార్పు తదితర అన్ని అంశాలను ఆహార-ఇంధన భద్రతపై సమావేశంలో ప్రస్తావించారు. ఈ పరిణామాల వల్ల ప్రపంచ సరఫరా గొలుసులు శిథిలావస్థకు చేరుకున్నాయని చెప్పారు. రష్యా చమురు సేకరణపై పాశ్చాత్య దేశాల ఆంక్షల క్రమంలో ఇంధన సరఫరాలపై ఆంక్షలు వద్దని మోదీ సూచించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పేందుకు సమష్టిగా కృషి చేయాలని అన్ని దేశాలకు పిలుపునిచ్చారు. ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ, దౌత్య మార్గాన్ని తిరిగి తీసుకురావడానికి మనమంతా పరిష్కారం కోసం అన్వేషించడం అవశ్యమని నొక్కిచెప్పారు. కొవిడ్ తర్వాత కొత్త ప్రపంచాన్ని సృష్టించే బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు.

'భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, భారత ఇంధన భద్రత అత్యంత ముఖ్యమైనది. దీని ప్రభావం ప్రపంచ సుస్థిరాభివృద్ధిపై ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇంధన సరఫరాపై ఎలాంటి ఆంక్షలు, పరిమితులను ప్రోత్సహించరాదు. చమురు విపణిలో స్థిరత్వం అవసరం' అని మోదీ అన్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధనానికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు. 2030 నాటికి భారత్ వినియోగించే విద్యుత్తులో సగం పునరుత్పాదక వనరుల నుంచి వస్తుందని, పునరుత్పాదక వనరుల ఇంధన ఉత్పత్తి కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలకు స్థిరమైన సాంకేతికను అందించడం, ఆర్థికంగా అండగా ఉండటం కూడా ముఖ్యమేనని మోదీ నొక్కిచెప్పారు.

సంక్షోభంలో చిక్కుకున్న దేశాలకు అండగా నిలిచేందుకు జీ20 వేదికగా కీలక నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నిత్యావసరాల సంక్షోభం ప్రభావం ప్రతి దేశంలోని పేదలపై తీవ్రంగా ఉన్నదని, వీరికి ఆపన్నహస్తం అవసరమని, అందులో ఐరాస వంటి బహుళపాక్షిక వ్యవస్థలు విఫలమవుతున్నాయని మోదీ అన్నారు. ఎరువుల కొరత ఆహార సంక్షోభానికి దారితీస్తుందని హెచ్చరించారు. ఆహార భద్రతను కల్పించే విషయంలో ఎరువుల కొరత పెద్ద సమస్య అని ఎరువులు, ధాన్యాల సరఫరా వ్యవస్థ స్థిరంగా కొనసాగేలా అన్ని దేశాలు పరస్పర ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని సూచించారు. భారత్‌లో సుస్థిర ఆహార భద్రత కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని, మినుములు వంటి పోషక, సంప్రదాయ ఆహార ధాన్యాలను ప్రాచుర్యంలోకి తెస్తున్నామన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ వృద్ధికి భారత్‌లో ఇంధన భద్రత ముఖ్యమని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో సవాళ్లభరిత వాతావరణ పరిస్థితుల్లో శిఖరాగ్ర సదస్సును నిర్వహించి ప్రపంచ దేశాధినేతలకు ఆతిథ్యమిచ్చినందుకు ఇండోనేసియాను భారత ప్రధాని అభినందించారు.

ప్రపంచ నేతలతో వరుస భేటీలు

అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు జో బైడెన్, ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, సెనెగల్ అధ్యక్షుడు, ఆఫ్రికన్ యూనియన్ చైర్మన్ మాకీ సాల్, నెథర్లాండ్స్ అధ్యక్షుడు మార్క్ రుట్టెతో మోదీ వేర్వేరుగా సమావేశమయ్యారు.

పరస్పరం సలహాలు-సూచనలు-అభిప్రాయాలను అధినేతలు పంచుకున్నారు. మోదీ బుధవారం ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడోతో భేటీ అవుతారు. కాగా, రిషి సునాక్ బ్రిటన్ ప్రధానిగా మోదీతో తొలిసారి ముఖాముఖి భేటీ అయ్యారు. అనంతరం ఇద్దరు అధినేతలు రెండు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం కలిపి పనిచేయాలని సంకల్పించారు. భవిష్యత్‌లో భద్రత, రక్షణ, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకోవడం ద్వారా మరింత ప్రగతిని రెండు దేశాలు సాధించగలవని ఆకాంక్షిస్తూ ట్వీట్లు చేశారు.

రెవెన్యూ క్రీడల అవినీతిపై దర్యాప్తు చేయాలి

ఏపీ రెవెన్యూ జేఏసీ, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుంటూరులో జరిగిన రెవెన్యూ క్రీడల కార్యక్రమాల్లో నెలకొన్న అవినీతికి సంబంధించిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్ వాస దివాకర్, ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం. అప్పల నాయుడు, ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షులు ఎం.పెద్దన్న మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెవెన్యూ క్రీడల పేరుతో అటు ప్రభుత్వాన్ని, ఇటు ఉద్యోగులను తీవ్రంగా మోసగించారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఈ అవినీతిపై విజిలెన్స్, ఏసీబీ, సీఐడీతో దర్యాప్తు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత ఈ రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగులు తీవ్ర పని ఒత్తిడితో ఇబ్బందులకు గురవుతుంటే, వారి సమస్యలను ఆలకించ కుండా, ఉద్యోగులకు రావలసిన డీఏ బకాయిలుగానీ, దాచుకున్న డబ్బులపైగానీ ఉద్యోగ సంఘాల నేతలు స్పందించకపోవడం విచారకరమని అన్నారు.

దళిత సంక్షేమ పథకాల పునరుద్ధరణ

- 28న కలెక్టర్లకు వినతిపత్రాలు
- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సమితి పిలుపు
- 6న విజయవాడలో సదస్సు: జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన దళిత సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) పిలుపు నిచ్చింది. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గసభ్యుల సమావేశం విజయవాడ దాసరి నాగభూషణరావు భవన్‌లో సమితి అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 28 దళిత సంక్షేమ పథకాలను నిలిపివేయడం దారుణ మన్నారు. వాటిని పునరుద్ధరించాలంటూ చాలాసార్లు ఆందోళన నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించ లేదన్నారు. ఈనెల 28వ తేదీన అన్ని జిల్లాల్లో డీహెచ్‌పీఎస్ అధ్వర్యంలో కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేయాలన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని, వివక్షకు గురవుతున్న దళిత క్రైస్తవుల రిజర్వేషన్లకి ఎలాంటి విఘాతం కలగకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని, ఎస్సీలకు భూపంపిణీ కోసం కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను ముందుకు తీసుకెళ్లడంతో పాటు భవిష్యత్తులో అన్ని సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. దళిత హక్కుల పోరాట సమితిని రాష్ట్రవ్యాప్తంగా బలమైన సంఘంగా నిర్మించుకునేందుకుగాను అన్ని జిల్లాల్లో సదస్సులు, సమావేశాల నిర్వహణకు కృషి చేయాలన్నారు. నూతన నాయకత్వాన్ని ఎన్నుకొని మహాసభల ఏర్పాటుకు, ప్రజాసమస్యల పరిష్కారానికి ఆందోళనలు నిర్వహించాలని తీర్మానించింది. డిసెంబరు 6న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్థంతి కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది.

6న లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక: జల్లి విల్సన్

మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్ మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద పాలనను ఎండగడుతూ, రాజ్యాంగ విలువల పరిరక్షణ, మత సామరస్య పరిరక్షణ కోసం డిసెంబర్ 6న లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్వర్యంలో విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి డీహెచ్‌పీఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టిరాయప్ప, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు తాటిపాక మధు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బీఎన్ కాలేజీ అవినీతిపై న్యాయ విచారణ

యాజమాన్యాన్ని తక్షణం అరెస్ట్ చేయాలి: జాన్సన్ బాబు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: ఎస్ఎస్ బీఎన్ కళాశాలలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన పాలక మండలి సభ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ, అనుబంధ ప్రజా సంఘాల అధ్వర్యంలో రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించేందుకు వెళ్తున్న నాయకులను టవర్ క్లాక్ సర్కిల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జాన్సన్ బాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ గౌడ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుల్లాయ్ స్వామి, చిరంజీవి మాట్లాడుతూ ఎస్ఎస్ బీఎన్ కళాశాలలో విద్యార్థుల స్కాలర్‌షిప్, రీ ఎంబర్స్‌మెంట్ సొమ్మును పాలక మండలి సభ్యులు స్వాహా చేశారని, కోర్టు జోక్యంతో సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, నిర్మలమ్మ, రమేశ్ బాబు, రంగయ్య, వెంకటరామిరెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదయిందన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, స్వాహా సొమ్ము తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎస్ బీఎన్ కళాశాల ఎంతోమంది మేధావులను తయారు చేసిందని, అలాంటి చరిత్ర గల కళాశాల పాలకమండలి విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ విషయంలో అవినీతికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులు సైతం స్పందించాలన్నారు. కళాశాలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సీబీసీఐడీ ద్వారా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి, యువజన సంఘాలు ఐక్యపోరాటాలు ఉధృతం చేస్తాయని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు మల్లికార్జున, కృష్ణుడు, రాజు, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమామహేశ్, ఏఐవైఎఫ్ నాయకులు దేవ, శ్రీకాంత్, లిఖిల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ ఆనంద్, సాయి, రాజు పాల్గొన్నారు.

అల్లూరి... మన జేమ్స్‌బాండ్ ఆయనే

సూపర్‌స్టార్ కృష్ణ మృతికి గవర్నర్, సీఎం సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు సినీ హీరో సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ మృతికి రాష్ట్ర గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్‌తో పాటు సీఎం జగన్, వివిధ రాజకీయ పార్టీలు సంతాపం తెలిపాయి. కృష్ణ మృతి పట్ల సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ట్విట్టర్ వేదికగా ఆయన సంతాపం తెలిపారు. కృష్ణ తెలుగు వారి సూపర్ స్టార్ అని, ఆయనే అల్లూరి... ఆయనే మన జేమ్స్ బాండ్ అని కొనియాడారు. నిజ జీవితంలోనూ మనసున్న మనిషిగా, సినీరంగంలో తనకుంటూ ప్రత్యేకను సంపాదించుకున్న ఆయన మరణం తెలుగు సినీ రంగానికి, తెలుగు వారికీ తీరని లోటని పేర్కొన్నారు. కృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీఎం జగన్ బుధవారం హైదరాబాద్ వెళ్లి కృష్ణ పార్థివ దేహానికి సీఎం నివాళులర్పించనున్నారు.

సినీ పరిశ్రమ ఓ దిగ్గజాన్ని కోల్పోయింది: చంద్రబాబు

తెలుగు సినీ పరిశ్రమ ఓ దిగ్గజాన్ని కోల్పోయిందని టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సినీ పరిశ్రమలో మంచి మనిషిగా, నిర్మాతల హీరోగా, నటశేఖరుడిగా, సూపర్‌స్టార్‌గా పిలిపించుకున్న నటులు, మాజీ ఎంపీ కృష్ణ మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. నటుడిగా, దర్శకుడిగా, స్టూడియో అధినేతగా, తెలుగు సినిమాకు తొలి సాంకేతికతను అద్దిన సాహస నిర్మాతగా కృష్ణను చెప్పుకుంటారని, టాలీవుడ్ జేమ్స్ బాండ్‌గా, విలక్షణ నటునిగా పేరున్న కృష్ణ మృతి సినీ రంగానికి తీరని లోటని తెలిపారు. కృష్ణ మరణంతో ఒక అద్భుత సినీశకం ముగిసినట్లయిందని పేర్కొన్నారు. కృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రజల్లో చైతన్యాన్ని రలిగించిన సూపర్‌స్టార్ కృష్ణ : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తెలుగు చలనచిత్ర చరిత్రలో ధ్రువతారగా వెలిగిన సూపర్‌స్టార్ కృష్ణ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రముఖ నటులు, నిర్మాత, దర్శకులు, సూపర్‌స్టార్‌గా సినీ వినీలాకాశానికి సుపరిచితులైన ఘట్టమనేని కృష్ణ మరణం బాధాకరమన్నారు. సినీ రంగంలో అనేక వినూత్న, విప్లవాత్మక, సాహసోపేతమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. దాదాపు 340కి పైగా చిత్రాలలో నటించి తెలుగు ప్రజల మనన్ననలు పొందిన విశిష్ట వ్యక్తి అన్నారు. ఈస్టమన్ కలర్, సినిమా స్కోప్, మల్టీకలర్, 70ఎంఎం వంటి మార్పులను తన నిర్మాణ సంస్థ ద్వారా తీసుకొచ్చా రని వివరించారు. అల్లూరి సీతారామరాజు వంటి సామాజిక చైతన్యవంతమైన చిత్రం నిర్మించి, ప్రజల్లో చైతనాన్ని రగిలించారని, కృష్ణ మరణం సినీ జగత్తుకు తీరని లోటని పేర్కొన్నారు. ఆంధ్రా జేమ్స్‌బాండ్‌గా చిరస్మరణీయుడైన కృష్ణ మరణం పట్ల రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. మహేష్‌బాబు, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సీపీఎం, కాంగ్రెస్, జనసేన, బీజేపీ సంతాపం

తెలుగు సినీ హీరో కృష్ణ మృతి పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు సాకే శైలజానాథ్, జనసేన నేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు తదితరులు సంతాపం తెలిపారు. కృష్ణ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అల్లూరి సీతారామరాజు లాంటి దేశభక్తి సినిమాలను నిర్మించారని వివరించారు. రాయలసీమకు కరువు వచ్చినప్పుడు సినీ ఇండస్ట్రీ జోలె పట్టి నిధులు వసూలు చేసినప్పుడు ఒక బృందానికి నాయకుడిగా కృష్ణ ఉన్నారని తెలిపారు. నటుడుగా, నిర్మాతగా, దర్శకుడిగా, తెలుగు సినిమా రంగానికి ఐదు దశాబ్దాల పాటు మరుపురాని సేవలందించారని అన్నారు.

నదీజలాల్లో వ్యర్థాలు కలపొద్దు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నదీ జలాల్లో వ్యర్థ పదార్థాలు కలవకుండా చూడాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం లక్ష్యం నెరవేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంపై హైదరాబాదు నుంచి మంత్రి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమం అమలులో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్టీపీ పనులు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆగస్టు 23 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణం కోసం అవసరమైన స్థల సేకరణకు అన్ని పురపాలక సంఘాల కమిషనర్లు ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లతో మాట్లాడి త్వరగా స్థలాలు సేకరించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ-ఆటోలు, క్లాప్ వాహనాలను సమకూర్చుకు నేందుకు అవసరమైన చర్యలు త్వరగా పూర్తి చేయాలన్నారు.

10 మున్సిపాల్టీల్లో ప్రత్యేక అధికారుల పాలన గడువు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో 10 మున్సిపాల్టీలకు ప్రత్యేక అధికారుల పాలన గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 2023, మే 5 లేదా ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల పాలన పొడిగిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీజేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తోపాటు రాజాం, భీమవరం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, బాపట్ల, తాడేపల్లిగూడెం, శ్రీకాళహస్తి, గూడూరు మున్సిపాల్టీలకు ప్రత్యేక అధికారుల పాలనను పొడిగించారు.

బీజేపీని ఒంటరి చేద్దాం

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను బలపర్చాలి : సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి, ప్రజలకు పదేపదే దగా చేస్తున్న బీజేపీని ఒంటరి చేయాలని, వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను బలపర్చాలని సీపీఎం పిలుపునిచ్చింది. విజయవాడ ఎంబీ భవన్‌లో ఈనెల 13, 14 తేదీల్లో సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. సమావేశాలకు ముఖ్య అతిథిగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హాజరయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో వివిధ తీర్మానాలను సమావేశం ఆమోదించింది. ఇటీవల విశాఖకు మోదీ వచ్చిన సందర్భంగా రోడ్లు, భవనాలు, వంతెనలకు ప్రారంభోత్సవాలు చేయడం మినహా రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి పథకాలు ప్రకటించలేదని, ప్రత్యేక హోదా, విభజన హామీల ప్రస్తావనే లేదని సమావేశం తీవ్రంగా తప్పుపట్టింది. విశాఖలో కార్మికులు, ప్రజలపై సాగుతున్న నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించింది. 638 రోజులుగా సాగుతున్న కూర్మన్నపాలెం ధర్నా టెంట్‌లోని నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం దుర్మార్గమని తెలిపింది. ఇంత జరుగుతున్నా ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ మౌనంగా ఉండడం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టడమేనని పేర్కొంది. వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు అనుసరిస్తున్న వైఖరి రాష్ట్ర ప్రయోజనాలకు, అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తోందని, ఇప్పటికైనా ఆయా పార్టీలు ముందుకొచ్చి రాష్ట్ర ప్రజల తరపున గళం విప్పాలని సూచించింది.

బీజేపీ నిరంకుశ మతోన్మాద విధానాలను, రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని ఎలుగెత్తి చాటాలని, బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టేందుకు వామపక్ష పార్టీలు చొరవ తీసుకోవాలని తెలిపింది. శాసన మండలి ఎన్నికల్లో బోగస్ ఓట్ల చేర్పిస్తూ, అక్రమాలకు పాల్పడ్డారని, ప్రత్యేక ఐఏఎస్ అధికారితో వాటిని పరిశీలన చేయించాలని డిమాండ్ చేసింది. వరదలు, భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, తక్షణమే వారికి ఆర్థిక సాయం చేయాలని, పోలవరం నిర్వాసితులకు పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించాలని తీర్మానించింది. అభివృద్ధి పేరుతో రైతుల నుంచి బలవంతపు భూసేకరణ నిలిపివేయాలని, వివిధ షెడ్యూలు రంగాలలో పని చేస్తున్న అసంఘటితరంగ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేసింది. రాజధాని పేరుతో ఉత్తరాంధ్ర ప్రజల్లో భావోద్రేకాలను రెచ్చగొట్టేందుకు వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఈ వివాదానికి స్వస్తి చెప్పి అమరావతిలోనే రాజధాని కొనసాగించాలని తీర్మానించింది. అధిక ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, జగనన్న ఇళ్ల నిర్మాణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రజా ఉద్యమాలపై సాగుతున్న తీవ్ర నిర్బంధాన్ని సమావేశం ఖండించింది. బీజేపీ మతోన్మాదాన్ని, ప్రజలపై భారాలు మోపుతున్న ఆర్థిక విధానాలను, రాష్ట్రానికి చేస్తున్న ద్రోహాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని బీజేపీ వ్యతిరేక పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ఒక్కతాటిమీదకు రావాలని సీపీఎం పిలుపునిచ్చింది.

ఇళ్ల నిర్మాణం కోసం రూ.లక్ష కోట్ల మహాయజ్ఞం

గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: రాష్ట్రంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ఆషామాషీ వ్యవహారం కాదని, రూ.లక్ష కోట్లతో ప్రభుత్వం చేస్తోన్న మహాయజ్ఞమని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్న 21 లక్షల ఇళ్ల కోసం నిర్మాణ వ్యయం రూ.40 వేల కోట్లు, భూసేకరణ వ్యయం రూ.25 వేల కోట్లు, జగనన్న కాలనీలలో మౌలిక వసతుల కల్పన వ్యయం రూ.34 వేల కోట్లు వెరసి దాదాపు లక్ష కోట్ల వ్యయంతో నిర్విరామంగా ఇళ్ల నిర్మాణ మహాయజ్ఞం జరుగుతోందన్నారు. మంగళవారం రాప్తాడు మండలం ఆలమూరు లే అవుట్ ను సందర్శించిన అనంతరం స్థానిక కలెక్టరేట్ లోని రెవెన్యూభవన్‌లో మంత్రి గృహ నిర్మాణ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, గృహ నిర్మాణశాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ... ఇళ్ల నిర్మాణ మహా యజ్ఞాన్ని విజయవంతంగా పూర్తి చేయాలంటే అధికారుల సహకారం అవసరమన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి గ్రామ-వార్డు స్థాయిలో వాలంటీరు వరకూ ప్రతి ఒక్కరూ వాళ్ల స్థాయిలో క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా కోటి 30 లక్షల ఇళ్లు మంజూరు కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి కారణంగా మన రాష్ట్రానికి 21 లక్షల ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అదే కృషి, అదే నిబద్ధత అధికారులు సైతం చూపించాలన్నారు. రూ.2,15,000 ల ఖర్చుతో ఇళ్ల నిర్మాణాలు చేపడతామని తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి నిర్వహిస్తున్న సంస్థ ముందుకు రావడంతో మరో350 సంస్థలు ఈ మహాయజ్ఞంలో భాగస్వామ్యం కోసం ముందుకొచ్చాయన్నారు. స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ మాట్లాడుతూ... 2023 డిసెంబరు నాటికి మంజూరైన 21 లక్షల ఇళ్లను జగనన్న కాలనీలలో పూర్తి స్థాయి మౌలిక వసతులతో పూర్తి చేసేందుకు హౌసింగ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖ, ప్రజా వైద్యం, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొందరు ఇంజినీర్లు ఇళ్ల నిర్మాణాల అంశం తమ పరిధిలోనిది కాదన్నట్టు వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గుంతకల్లులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామి రెడ్డి కోరారు. నిర్మాణాలకు అనుకూలంగా లేని ప్రాంతాల వారికి ప్రత్యామ్నాయం చూపాలని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కోరారు.

కామార పల్లిలో ఇచ్చిన పట్టాల్లో భౌగోళిక కారణాల వల్ల ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితి ఉందన్నారు. లే అవుట్ లలో నిర్మాణ వ్యయం ఖర్చు తగ్గించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ఇసుక డిపోలు కాలనీలకు దగ్గరగా ఉండేలా చూడాలని

ఎమ్మెల్సీ శివరామి రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, ఏడీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ లిఖిత, ఆహుడా చైర్ పర్సన్ మహాలక్ష్మి శ్రీనివాస్,అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహితీ తదితరులు పాల్గొన్నారు.

వీఐటీలో జాతీయస్థాయి హ్యాకథాన్

ఏపీ ఇన్నోవేషన్ సొసైటీతో ఎంవోయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో 24 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను నిర్వహించారు. స్థిరత్వాన్ని థీమ్ ఆధారంగా ఈ హ్యాకథాన్ జరిగింది. ఇందులో 300 విద్యార్థులు పాల్గొనగా, వారిలో 96 మంది విద్యార్థులు ఇతర విద్యాసంస్థల నుంచి పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్ పోటీలో విద్యార్థులు బృందాలుగా ఏర్పడి సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను వర్తింపచేస్తూ సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు వినూత్న పరిష్కారాలను (హార్డ్‌వేర్/సాఫ్ట్‌వేర్) అభివృద్ధి చేయడంలో పనిచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఫ్‌ట్రానిక్స్ వ్యవస్థాపకులు దాసరి రామకృష్ణ హాజరై తన వ్యక్తిగత అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. గౌరవ అతిథులుగా ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్‌కుమార్ తెంటు, టెక్ మహీంద్రా రిక్రూట్‌మెంట్ హెడ్ వీరంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరై విజేతలైన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ముగింపులోనే ఏపీ ఇన్నోవేషన్ సొసైటీతో విట్ యూనివర్సిటీతో ఎంవోయూ చేసుకుంది. ఈ అవగాహనా ఒప్పందం ద్వారా వీఐటీ విశ్వవిద్యాలయానికి ఇంక్యుబేషన్ సెంటర్‌కు సలహా మండలిగా వ్యవహరిస్తూ ప్రణాళిక తయారీ, అమలు, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ అవేర్‌నెస్, మెంటరింగ్ ప్రోగ్రామ్‌లు, నెట్ వర్కింగ్, వర్క్‌షాప్‌లు, టెక్నాలజీ షోకేస్ ఈవెంట్‌ల ద్వారా ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఎకో సిస్టమ్‌ను మెరుగుపర్చడం, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ వాణిజ్జీకరణ, సాంకేతికతను సులభతరం చేయడం, పరస్పర ప్రయోజనకరమైన సాంకేతిక రంగాలకు కన్సల్టెన్సీ మద్దతు, సహకార ప్రాజెక్టులపై డేటా, సౌకర్యాల భాగస్వామ్యంపై సహకారం అందిస్తుందని అనిల్‌కుమార్ తెలిపారు. వీఐటీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో స్టార్టప్, ఇన్నోవేషన్ కార్యకలాపాల నిర్వహణకు ఇన్నోవేషన్ సొసైటీతో జరిగిన ఎంవోయూ ఎంతో బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, విద్యార్థులు మేటవేర్స్, బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేథస్సు, రోబోటిక్స్ వంటి డీప్ టెక్నాలజీల ఆధారంగా ఉత్పత్తులను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీస్ ముదిగంటి, ఐఐఈసీ డైరెక్టర్ డాక్టర్ అమీత్ చవాన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమాన్ని ఉధృతం చేయాలి

విశాలాంధ్ర- కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వంపై పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యుడు ఎన్. రామారావు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షలు మంగళవారం 642వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో కర్మాగారం నుంచి ఎఫ్ఎండీ, సీఎంఈ, ప్లాంట్ డిజైన్ విభాగాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందరర్భంగా రామారావు మాట్లాడుతూ... విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్మిక వర్గం ఆలోచించి ఐక్య ఉద్యమాలు చేపట్టేందుకు తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. దీనికి మద్దతుగా కార్మిక వర్గం పూర్తి సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దీక్షా శిబిరంలో ప్రతినిధులు వెంకట్రావు, మధు, బాలకృష్ణ, గోపి, రాజు, దుర్గాప్రసాద్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రసాయన కర్మాగారంలో పేలుడు

ముగ్గురు కార్మికుల మృతి

విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద రసాయన కర్మాగారంలో పేలుడు సంభవించిం ది. ఈ దుర్ఘటనలో ముగ్గురు కార్మికులు దుర్మరణం చెం దారు. విజన్ డ్రగ్స్ పరిశ్రమలో ఇథైల్ కాలమ్ గొట్టం వద్ద మిథైల్ నీరు రీసైక్లింగ చేసే క్రమంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో, మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు జరిగింది. ఆ సమయంలో అక్కడ పనిలో నిమగ్నమైన చాగల్లుకు చెందిన మహీధర్ ముసలయ్య, తాళ్ళుం పూడి వాసి వెంగళ రత్నబాబు, గౌరీపట్నానికి చెందిన ఏపీ సత్యనారాయణ అనే ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తోటి కార్మికులు, కర్మాగారం యాజమాన్యం క్షతగాత్రులను కొవ్వూరు ప్రభుత్వా స్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యుల్ని హోంమంత్రి తానేటి వనిత పరామర్శించారు. సంఘటన జరిగిన స్థలాన్ని జేసీ శ్రీధర్, ఇన్‌చార్జ్ ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి దుర్ఘటనకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం విచారణ చేపట్టింది.

ఒకే కుటుంబంలో ఇద్దరి ఆత్మహత్య

వైసీపీ నేతల వేధింపులే కారణమంటున్న బంధువులు

విశాలాంధ్ర-పెందుర్తి: విశాఖ జిల్లా పెందుర్తి మండలం ముదపాక గ్రామంలో మహిళ ఆత్మహత్య ఘటన సంచలనం రేపింది. స్థలవివాదానికి సంబంధించి గత సెప్టెంబర్ 8న సారిపల్లి సోమేశ్వరరావు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, అదే విషయమై సోమవారం రాత్రి సోమేశ్వరరావు అక్క కడియాల అచ్చాయమ్మ పాడుబడిన బావిలోకి దూకి తనువు చాలిచింది. కాగా తన 60 గజాల ఇంటి స్థలం విషయంలో స్థానిక వైసీపీ నాయకుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సోమేశ్వరరావు లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో బాధ్యులను అరెస్టు చేస్తామని అప్పట్లో పోలీసులు హామీ ఇచ్చారు. ఆ స్థల వివాదం కోర్టులో నడుస్తుండగానే మరోవైపు రెవెన్యూ అధికారులు సర్వే చేసి వైసీపీ నాయకులు ఒత్తిడితో తమను వేధించే వారిని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సోమేశ్వరరావు అక్క అచ్చాయ్యమ్మ ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని బావి నుంచి బయటికి తీసి పోస్టుమార్టంకు తరలించే ఏర్పాటు చేయగా ఆమె బంధువులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. పోలీసులు, అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు తీవ్ర అన్యాయం జరిగిందని న్యాయం జరిగే వరకూ మృతదేహాన్ని తరలించడానికి వీలు లేదంటూ పట్టుబట్టారు. ఆ సమయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అతి కష్టం మీద అంబులెన్సులో అచ్చాయమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మరోవైపు మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. రాష్ట్రంలో అధికార వైసీపీ అరాచకాలు మితిమీరాయని పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నాయకులను, పేదలను బలి తీసుకుంటున్నారని బండారు ఆరోపించారు. పోలీసుల అలసత్వమే అచ్చాయమ్మ ఆత్మహత్యకు కారణమన్నారు. నిందితులను గాలికి వదిలేసి పక్షపాత ధోరణి ప్రదర్శించారని మండిపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

సంపాదకీయం

క్రిప్టో కరెన్సీ ధమాల్

ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా క్రిప్టో కరెన్సీపై విపరీతమైన మోజు ఏర్పడింది. ఇది కళ్లకు కనిపించదు, చేతులతో లెక్కించేది కాదు. అయినప్పటికీ ఈ కరెన్సీని కొనుగోలు చేసేవారి సంఖ్య అపారంగా పెరిగింది. మన దేశంలోనూ ఈ కరెన్సీని అనుమతించరాదన్న డిమాండ్ వచ్చింది. దీనిపై నియంత్రణ పెడతామని రిజర్వు బ్యాంకు చెప్పగా పార్లమెంటులోనూ దీనిపై స్వల్ప చర్చ సాగినప్పటికీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. క్రిప్టో కరెన్సీలో అనేక సంస్థలు ప్రవేశించి వ్యాపారం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఒక్కసారిగా క్రిప్టోకరెన్సీ సంస్థల ధరలు ధమాల్‌మన్నాయి. దాదాపు లక్ష బిలియన్ అమెరికన్ డాలర్ల నష్టం జరిగిందన్న అంచనాలతో కోట్లాదిమందిలో ఏనాడూ లేనంతగా ఆందోళన పెరిగింది. దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. క్రిప్టోకరెన్సీతో వ్యాపారం చేస్తున్న వందలాది సంస్థలు దివాలా తీశాయి. ఈ కరెన్సీలోకి వందలాదిమంది ప్రవేశించి వ్యాపారం చేస్తున్నారు. ఈ కరెన్సీలో మొదటి సంస్థ బిట్‌కాయిన్. అన్ని విషయాల్లోనూ దీనిని బంగారంతో సమానంగా పరిగణించారు. గత వారం ఇది ఒక్కసారిగా కుప్పకూలింది. బిట్‌కాయిన్ విలువ గత ఏడాది 75శాతం పెరగగా, గత వారం ఒకేసారి మూడువంతులు పడిపోయింది. బంగారం, అమెరికన్ డాలరు లేదా మరో ఇతర కరెన్సీకంటే విలువైనదిగా బిట్‌కాయిన్ పేరు పొందింది. బిట్‌కాయిన్ కంటే అనేక ఇతర సంస్థలు మరింతగా నష్టపోయాయి. ఏడాదికాలంలో అనేక సంస్థల కరెన్సీ విలువ 80–90శాతం పడిపోయి పూర్తిగా ఈ రంగం నుంచి తుడిచిపెట్టుకు పోయిందన్నది నేటి వాస్తవం. బిట్‌కాయిన్‌లో పెట్టుబడిపెట్టిన వారిలో 90శాతం నష్టాల్లో చిక్కుకున్నారు. ఇందులోకి వచ్చిన సంస్థల్లో ఎఫ్‌టీఎక్స్, ఎఫ్‌టీటీ, బినాన్స్ తదితర వందలాది సంస్థలు మళ్లీ ఈ వాణిజ్యంలో కొనసాగే అవకాశాలున్నాయా అనేది ప్రశ్నార్థకం. క్రిప్టో ఎక్చేంజ్ వేదికలలో అతి పెద్దది. ఖాతాదారుల డిపాజిట్లతో విచ్చలవిడిగా కొనుగోలు చేయడం ద్వారా ఇతరసంస్థల విలువను పెంచాయి. తద్వారా స్వలాభం పొందాయి. అలాగే భారీగా అవకతవకలకు యాజమాన్యాలు పాల్పడడం, అనేక సంస్థలు కుప్పకూలడానికి ప్రధాన కారణాలు. వీటిలో వాణిజ్యం చేసినవారు, తమ కరెన్సీలను దాచుకున్న వారు కుదేలయ్యారు. ఎఫ్‌టీఎక్స్ సంస్థ అమెరికా కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేసిందన్న వార్తలు వచ్చాయి. ఈ సంస్థ సీఈఓ గతంలో వాల్‌స్ట్రీట్‌లో వాణిజ్యం చేసిన శ్యామ్ బ్యాంక్‌మన్ ఫ్రైడర్ రాజీనామా చేశారు. 2019లో ఇందులోకి వచ్చిన ఫ్రైడర్ ఎక్కువగా ఎఫ్‌టి ఎక్స్‌పై ఆధారపడి అపారంగా నష్టపోయానంటున్నారు. 2022లో ఈ సంస్థ 400 మిలియన్ డాలర్లు సేకరించగా అది 32 బిలియన్ డాలర్లకు విలువ పెరిగింది. సాఫ్ట్ బ్యాంక్, టిమాస్క్ టైగర్ గ్లోబల్, బ్లాక్‌రాక్, సిక్వియ లాంటి సంస్థల నుంచి పెట్టుబడులను సేకరించింది. గత రెండు సంవత్సరాలుగా నష్టపోయిన అనేక కంపెనీలు తిరిగి కోలుకోవడానికి సహాయపడినట్లు చెప్తోంది. తను 32బిలియన్ డాలర్లను నష్ట పోయినట్లుగా ఎఫ్‌టీఎక్స్ వెల్లడించింది. అతిపెద్ద వాణిజ్య వేదిక ఎఫ్‌టీటీ సహవ్యవస్థాపకుడు, సీఈఓ బినాన్స్ ట్విటర్ ద్వారా తమన సంస్థ హోల్డింగ్స్ అన్నింటిని లిక్విడేట్ చేస్తున్నట్లు ప్రకటించాడంటే క్రిప్టో కరెన్సీకి ఏ గతి పట్టిందనేది సులువుగానే అర్థమవుతుంది. ఎఫ్‌టీఎక్స్ సీఈఓ శామ్ తన సొంత డబ్బు 17 బిలియన్ డాలర్లు కోల్పోయానని ప్రకటించారు.

క్రిప్టో కరెన్సీలోకి వచ్చిన సంస్థలు సెల్సియస్ నెట్‌వర్క్, త్రీయారోస్, ఓయగర్ కూడా గత ఏడాది బాగా లాభం పొందినప్పటికీ ఇటీవల కాలంలో వరుసగా దివాలా తీశాయి. ఇలాంటి సంస్థలను రకరకాల మార్గాలలో నమ్మించి మోసం చేసిన సంఘటనల్లో బహుశ ఇది ప్రపంచలోనే అతి భారీదిగా చెప్పవచ్చు. అతి పెద్ద పెట్టుబడిదారుడు వారెన్ బఫెట్ సైతం వీటిపట్ల ఆకర్షితుడుకావడం, నేడు ధనం మాత్రమే పరమావధిగా భావించి ఎండమావుల వెంట పరుగెడుతున్నారని భావించాలి. తాను కొనుగోలు చేసిన వాటాలను విక్రయించి మరెప్పుడూ పెట్టుబడి పెట్టబోనని ప్రకటించారంటే క్రిప్టో ప్రభావం సాధారణ కొనుగోలుదారులపైనేకాక బడా పెట్టుబడిదారులకు సైతం వణుకు పుట్టిస్తోంది. క్రిప్టో కరెన్సీలో ఇంత పెద్ద సంక్షోభానికి కారణం ఎఫ్‌టీఎక్స్‌దే బాధ్యత అని విశ్లేషిస్తున్నారు. ఈ రంగం అంతర్థానం గాకుండా తిరిగి పుంజుకోవడానికి కృషి చేస్తామని వివిధ సంస్థలు ప్రకటిస్తున్నాయి. ఇలాంటి ప్రకటనలు పెట్టుబడి పెట్టేవారిని నమ్మించి మోసగించడానికే కావచ్చు. వాణిజ్య బ్యాంకులలో కోట్లాది ప్రజలు తమ కష్టార్జితాన్ని దాచుకోగా బడాబాబులు రుణాలుగా తీసుకొని ఎగవేస్తున్న సంఘటనలను మనం చూస్తున్నాం. అనుభవిస్తున్నాం. చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనట్టుగా బ్యాంకుల్లో సొమ్మును బడాబాబులు అనుభవిస్తున్నారు. కార్పొరేట్ పారిశ్రామికవేత్తల మోసాలను పెద్దగా పట్టించుకోని ప్రభుత్వాలు ఇలాంటి వ్యవహారాలలో జోక్యం చేసుకొని ప్రజలకు న్యాయం చేస్తాయనుకోవడం కష్టమే. 2017 మార్చిలో 5500 శాతం అపారంగా పెరిగిన బిట్‌కాయిన్ దాదాపు ఐదేళ్ల కాలంలో కుప్పకూలింది. క్రిప్టోకరెన్సీలో పెట్టుబడిపెట్టి అపార లాభాలు పొందాలనుకునే వారు నేటి సంక్షోభాన్ని హెచ్చరికగా తీసుకోవలసి ఉంటుంది. ప్రభుత్వాలు విచ్చలవిడిగా కరెన్సీ నోట్లను ముద్రిస్తే అనేక రంగాలపై ప్రతికూల ప్రభావం చూపించి సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేస్తాయి. క్రిప్టో కరెన్సీ వ్యాపారం చేస్తున్న సంస్థలకు ప్రింట్ చేసే అవకాశం ఉండదు. బ్లాక్‌చెయిన్ లెడ్జరు ద్వారా లావాదేవీలు జరుగుతాయి. ద్రవ్య వాణిజ్యం చేసే హెడ్జ్‌ఫండ్స్, బ్యాంకులు, బ్రోకర్లు తదితర అనేకమంది క్రిప్టోకరెన్సీవైపు ఆకర్షితులయ్యారు. స్టాక్‌మార్కెట్ సెన్సెక్స్ పెరగడం, తరగడం లాంటి వాణిజ్యం కాదని అర్థమవుతుంది. వేగంగా డబ్బు సంపాదించాలని తహతహలాడటం చాలా ప్రమాదకరం. లోతుగా ఆలోచించి పెట్టుబడులు పెట్టి క్రమంగా అభివృద్ధి చెందాలని యోచించేలోగా అప్పటికప్పుడు కోటీశ్వరులం కావాలనుకోవడం మంచి ఆలోచనకాదని మనకు క్రిప్టో తెలియజేస్తోంది. విలువపెరిగేవాటిలో, రియల్‌ఎస్టేట్ సంపద, అంతిమంగా ప్రయోజనం కల్పించే వాటిని ఎంచుకొని పెట్టుబడులు పెట్టాలి. పాలకులు, యువత వేగంగా సంపాదనవైపు పరుగులు పెట్టించే విధానాలను విడనాడాలి.

మహిళలకు వేతనాల్లో ఇంకా వివక్షేనా?

రావు శ్రీ

ఈ నవంబర్ 15వ తేదీ నాటికి ప్రపంచ జనాభా 800 కోట్లు మైలురాయి చేరుతుంది అని అంచనా. ప్రపంచ జనాభాలో మహిళలు 49.58శాతం కాగా, నిష్పత్తి ప్రకారం 101.68:100 మంది ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లో 48.04శాతం మహిళలు ఉన్నట్లు, నిష్పత్తి ప్రకారం 1000:948 గా ఉన్నట్లు తెలుస్తోంది. అంటే దేశంలో దాదాపు సగంమంది మహిళలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదేవిధంగా, అనేకరంగాల్లో పురుషులతో సమానంగా మహిళలుపనిచేస్తున్నా వేతనాలుమాత్రం నేటికీ అనేకదేశాల్లో సమానంగా లేకపోవడం గమనార్హం. ఒకే పనిని స్త్రీ పురుషులు సమానంగా చేస్తున్నా, ఒకే ప్రతిఫలం వస్తున్నా వేతనాల్లో తారతమ్యం భారీగా ఉంది. మహిళల పట్ల వివక్షత కొనసాగుతూనే ఉంది. ఇటీవల భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) పురుషుల క్రికెట్ క్రీడాకారులతో సమానంగా మహిళా క్రికెట్ క్రీడాకారులకు సమానవేతనం ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామం. 1976లో "సమాన వేతనచట్టం" అమలులోకి వచ్చినా నేటికీ అనేకరంగాల్లో అమలు కావడంలేదు. దీనికై ప్రభుత్వాలు, కార్మికశాఖ నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. మహిళలహక్కులకోసం, వేతనాలుకోసం, సమానత్వం కోసం కృషిచేయాలి. ముఖ్యంగా వ్యవసాయరంగంలో, అసంఘటిత రంగాల్లో మరీ ఎక్కువగా ఈ అసౌమ్యతాలు ఉన్నాయి. మన భారత దేశంలో నేటికీ పితృస్వామిక కుటుంబ వ్యవస్థ అమలవుతున్న నేపథ్యంలో పురుషాధిక్యత సమాజం నేటికీ కొనసాగుతోంది. చాలా కుటుంబాల్లో వేతనాలు పొందుతున్న మహిళల ఏటీఎమ్ కార్డులు, ఆర్థిక అంశాలు అన్నీ దాదాపుగా పురుషులు ఆధీనంలో ఉండటం గమనార్హం. నేటికీ అనేక కుటుంబాల్లో మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలకు చదువు, ఆస్తివిషయాల్లో సమానఅవకాశాలు కల్పించడంలేదు. బాల్య వివాహాలు జరుగుతున్నాయి. 2020ఆగష్టులో సమాన ఆస్తిహక్కు కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చినతీర్పు ఏమేరకు అమలు జరుగుతుందో పరిశీలన చేయాలి.

"వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ రిపోర్ట్ –2022" ప్రకారం భారతదేశంలో 82శాతం పురుషులు ఒకరకమైన వేతనాలు పొందుతూ ఉంటే, అవే వేతనాలు కేవలం 18శాతం మహిళలు పొందుతున్నారు అని తెలిపింది. అనగా ఎంత భారీ వ్యత్యాసం ఉందో తెలుస్తుంది. శారీరకశ్రమ చేస్తున్న మహిళల్లో ఎక్కువ శాతం నిరక్షరాస్యులే.. వీరిలో చాలామందికి ఒకే పనికి పురుషులతో సమానంగా వేతనాలు లభించుట లేదు. పట్టణప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి. తక్కువమంది మహిళలకే సరైన వేతనం అందుతుంది. ఏమైనా పోరాటాలు చేయాలని భావిస్తే, అంత కంటే తక్కువ వేతనానికి పనిచేయడానికి అనేక మంది మహిళలు సిద్ధంగా ఉన్నందునే, మహిళలకు సమానవేతనం అందని ద్రాక్ష పండే. ఇటీవల "వరల్డ్ ఎకనామిక్ ఫోరం"146 దేశాల్లో లింగ సమానత్వంపై పరిశీలన చేయగా, మనదేశం 135వ స్థానంలో ఉండటం బాధాకరమైన విషయం. దేశం అభివృద్ధి చెందుతోందని పాలకులు, ప్రభుత్వాలు ప్రచారంచేస్తున్న తరుణంలో ఈ వివక్షతపై వారిచ్చే సందేశం ఏమిటి...? నేటికీ మహిళా బిల్లు ఆమోదం పొందకుండా, పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉండటం దేనికి నిదర్శనం..? మహిళల హక్కులు, వేతనాల కోసం, సమానత్వం కోసం ఇకనైనా చిత్తశుద్ధితో పనిచేయాలి. ప్రపంచవ్యాప్తంగా మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా గుర్తిస్తున్నారు. వినోదరంగం (సినిమా,టి.వి), మెడిసిన్, లా, క్రీడలు వంటి రంగాల్లో మహిళలు వేతన పరంగా మరింత వివక్షతను ఎదుర్కొంటున్నారు. 2018 లో "ఫోర్బ్స్" పత్రిక ప్రకటించిన 100మంది అత్యంత రెమ్యునరేషన్ తీసుకుంటున్న అథ్లెటిక్స్‌లో, ఒక మహిళ కూడా లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం కొన్ని లక్షల మంది ఉపాధి పొందుతున్న సాఫ్ట్‌వేర్ రంగంలోనూ, ప్రైవేటు విద్యాసంస్థలు, మెడికల్ రంగంలోనూ పనిచేస్తున్న పురుషులు కంటే, మహిళలు తక్కువ వేతనం తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రపంచ ఆర్థికఫోరం నివేదిక ఆధారంగా డాక్టర్లగానూ మహిళలు తక్కువ వేతనం తీసుకుంటున్నట్లు తెలిపారు.

మనదేశంలో 15శాతంమంది మహిళలు న్యాయవాదులుగా ఉన్నారు. పురుష న్యాయవాదులు ఎక్కువ రెమ్యూనరేషన్/ ఫీజులు తీసుకుంటున్నారు అని తెలుస్తోంది. నిర్ణయాత్మక స్థానంలో సీఈఓలుగా ఉన్నత స్థాయిలో పనిచేస్తున్న మహిళలు కూడా తక్కువ వేతనం పొందుతున్నారు. "అహ్మదాబాద్ ఐఐఎమ్" నివేదిక ప్రకారం, పురుషులతో సమానంగా చదువుకుని ఒకే పనిచేస్తున్న మహిళలు, వేతనాలు విషయంలో తీవ్ర వివక్షత ఎదుర్కొంటున్నారు అని తెలిపింది. ఈ పరిస్థితుల్లో పురుషులతో సమానంగా మహిళలు వేతనాలు, హక్కులు సాధించాలి అంటే మహిళలు మరింత విద్యావంతులుగా మారి, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి. కుటుంబస్థాయి నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలపట్ల సమానత్వం చూపించాలి. ధైర్యం నూరిపోయాలి. మూఢనమ్మకాలు విడనాడాలి. ప్రభుత్వాలు చట్టాలు కచ్చితంగా అమలు చేయాలి. దీనిపై కార్మికశాఖ తనిఖీలు నిర్వహించాలి. మీడియా, స్వచ్ఛంద సంస్థలు ముఖ్యంగా పురుషులు కూడా మహిళా సాధికారత కోసం సహకారం అందించాలి. అప్పుడు మాత్రమే ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అభివృద్ధి చెంది, స్వయం సమృద్ధి సాధించగలరు.

అవినీతి నిరోధంపై మోదీ సుభాషితాలు, సుద్దులు!

ఎం కోటేశ్వరరావు

దేశంలో ఏం జరుగుతోంది? అందరూ శాకాహారులే రొయ్యల బుట్ట మాయం అన్నట్లుగా దేశంలో అందరూ సత్యహరిశ్చంద్రుల వారసులం, అవినీతి అంటే అదేమిటో తెలియని వారం అన్నట్లుగా ఉంటారు. అయినా అవినీతి గురించి మాట్లాడని రోజు లేదు. దేశంలో అవినీతిని రూపు మాపేందుకు ఒక నిపుణుల కమిటీని వేసేందుకు ఆదేశాలు జారీ చేయాలంటూ బీజేపీ నేత అశ్వనీ ఉపాధ్యాయ దాఖలుచేసిన ప్రజాప్రయోజన దరఖాస్తును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అదే బీజేపీ నేతలు మరోవైపు దేశంలో అవినీతి లేదు అక్రమాలు లేవంటూ రోజూ ఢంకా బజాయించి మరీ చెబుతుంటారు. స్వచ్ఛత సూచికలను ప్రకటిస్తున్న మాదిరి నెల లేదా మూడు నెలలకు ఒకసారి అవినీతి అధికారుల మీద ఉన్న కేసుల ఆధారంగా వివిధ శాఖలకు కూడా సూచికలను ప్రకటించాలని ప్రధాని నరేంద్రమోదీ చెబుతారు. ఆచరణ చూస్తే విస్తుపోతారు.

మన దగ్గర ఇప్పటికే ప్రత్యేక చట్టాలున్నాయని, అవినీతి నిరోధానికి చర్యల గురించి లా కమిషన్‌ను అడగాలని వేసిన పిటీషన్‌ను కోర్టు కొట్టివేసింది. నరేంద్రమోదీకి అధికారాన్ని కట్టబెట్టంలో కాంగ్రెస్ నేతల అవినీతి, అక్రమాలు ప్రధాన పాత్ర పోషించిన అంశం తెలిసిందే. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్(టిఐ) ప్రకటించిన అవినీతి సూచికలో 2012, 2013 సంవత్సరాల్లో మన దేశం 94వ స్థానంలో, 2014లో 85, 2015లో 76కు ఎదిగింది. తరువాత క్రమంగా దిగజారుతూ 2020లో 86, 2021లో 85వ స్థానంలో ఉంది. 2022 సూచికను వచ్చే ఏడాది జనవరిలో ప్రకటిస్తారు. అవినీతి అంతం గురించి చెప్పిన మోదీ పాలనలో అవినీతి కోరలు చాస్తోందన్నది సుస్పష్టం. ఐటీ సూచికలు సరైనవా కాదా అన్న చర్చకువస్తే కాంగ్రెస్ పాలనలో, బీజేపీ ఏలుబడిలో సూచికలను ఇచ్చింది కూడా అదే సంస్థ కనుక మోదీ పాలన గురించి ఇచ్చింది తప్పయితే కాంగ్రెస్ పాలన గురించి చెప్పింది కూడా తప్పే అవుతుంది. ఎక్కడ చూసినా అవినీతి తాండవిస్తోంది కనుకనే అసలు దాని గురించి చర్చకు రాకుండా జాగ్రత్తపడుతున్నారు. వచ్చినా మా మోదీ మీద ఇంతవరకు ఒక్క ఆరోపణలేదుగా అని ఎదురుదాడికి దిగుతున్నారు. ఆ మాటకొస్తే మన్మోహన్ సింగ్ మీద కూడా ఏమీ లేవు.

ఇటీవల నిఘా చైతన్య వారోత్సవాల్లో ప్రధాని మోదీ ఎన్నో సుభాషితాలు పలికారు. అధికారుల మీద అపరిష్కృతంగా ఉన్న కేసుల సంఖ్యను బట్టి వివిధ శాఖలకు సూచికలు ఇవ్వాలని సూచించారు. ఆ నిర్ణయంచేసి ఆ సభలో పాల్గొని ఉంటే విశ్వసనీయత ఉండేది. ఎవరు అడ్డుపడ్డారు ? కేంద్ర నిఘా సంస్థలో ఫిర్యాదుల యాజమాన్య వ్యవస్థను ప్రధాని ప్రారంభించారు. అవినీతి నిరోధక సంస్థలలో పనిచేస్తున్నవారి మీద బురద చల్లేందుకు, పని చేయనివ్వకుండా చూసేందుకు స్వప్రయోజన పరులు చూస్తారని, ఆ క్రమంలోనే తనను కూడా లక్ష్యంగా చేసుకున్నారని,

కానీ ప్రజలు సమయం వచ్చినపుడు నిజానికి మద్దతుగా నిలుస్తారు అన్నారు. కేంద్ర నిఘా సంస్థ 2021 వార్షిక నివేదిక ప్రకారం కేంద్ర శాఖల్లోని అధికారులు, సిబ్బందిపై వచ్చిన 1,09,214 ఫిర్యాదుల్లో ప్రధాని తరువాత స్థానంలో ఉన్న అమిత్ షా నిర్వహిస్తున్న హోంశాఖ మీద వచ్చిన ఫిర్యాదులు 37,670. కాగా 11,003తో రైల్వే, 6,330తో బ్యాంకులు ఉన్నాయి. 2013లో సివిసికి 35,332 వచ్చాయి. ఆ తరువాత నుంచి క్రమంగా పెరుగుతున్నాయి. మోదీ అధికారానికి వచ్చిన తరువాత అధికారుల్లో అవినీతి పెరిగినట్లా తగ్గినట్లా !

కేసుల గురించి సూచికలు ఇమ్మని ప్రధాని చెప్పారు సరే, తన ఏలుబడిలోని ప్రభుత్వ శాఖలు ఎలా పనిచేస్తున్నట్లు ? కామన్‌వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనీషియేటివ్ సంస్థ ఒక సమాచారహక్కు ప్రశ్నకు ఇచ్చిన సమాధానాన్ని వెల్లడించింది. దాని ప్రకారం 2013 ఏప్రిల్–2017 ఫిబ్రవరి వరకు డీజీఎఫ్‌టీ కార్యాలయాలకు అందిన 181 అవినీతి ఫిర్యాదులపై ఒక్కదాని మీద కూడా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని, 2009లో వచ్చిన వాటిలో ఒక కేసులో ఒక అధికారిపై విధించిన పెనాల్టి వివరాలను కూడా సమాచారహక్కు కింద ఇవ్వలేదని తేలింది. దరఖాస్తులకు సమాధానాలు కూడా ఇవ్వలేదు. కర్ణాటక లోకాయక్త సమాచారహక్కు ప్రశ్నకు ఇచ్చిన సమాధానం మరింత దారుణంగా ఉంది. అవినీతి కేసులు, తాను దర్యాప్తు చేసిన వాటి వివరాలను గణాంకాలను నిర్వహించాల్సిన బాధ్యత తమకు లేదని, 2006లో కేంద్ర సమాచార కమిషన్ జారీచేసిన ఉత్తరువు ప్రకారం పెద్ద ప్రజాప్రయోజనం ఉంటే తప్ప సమాచారం ఇవ్వనవసరం లేదని, సమాచారం గనుక ఇస్తే నిందితులైన అధికారుల గోప్యతకు భంగం కలుగుతుందని కూడా సమాధానమిచ్చింది. నిఘా చైతన్య వారోత్సవాల్లో ఇలాంటి సంస్థలు, వ్యవస్థ అధికారులకే నరేంద్రమోదీ సుభాషితాలను వినిపించారు.

నరేంద్రమోదీ పాలనలో అవినీతి పెరిగిందని, గ్రామాల సంపదలను పారిశ్రామికవేత్తలు లూటీచేస్తుంటే ప్రభుత్వం మౌనంగా ఉందని అన్నా హజారే కార్యదర్శి కల్పన నవంబరు పదవ తేదీన లక్నోలో రాష్ట్రీయ కిసాన్ మంచ్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చెప్పారు. 2011లో అన్నా హజారే ప్రారంభించిన అవినీతి వ్యతిరేక ఆందోళన కారణంగా కాంగ్రెస్‌కు మారుగా బీజేపీ అధికారానికి వచ్చిందని ఎనిమిది సంవత్సరాలుగా చేసిందేమీ లేదన్నారు. గతంలో కూడా అన్నా హజారే ఇలాంటి హెచ్చరికలే చేశారు. ఇప్పుడేం చేస్తారో చూడాల్సి ఉంది. మోదీ అధికారానికి వచ్చిన తరువాత ఈడీ తదితర సంస్థల దాడులు విపరీతంగా పెరిగాయి. 2004–2014 కాలంలో 112, 2014–2022 కాలంలో 3,010 దాడులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. 112 దాడుల్లో స్వాధీనం చేసుకున్న మొత్తం రు.5,346 కోట్లు కాగా, 3010 దాడుల్లో రూ.99,356 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. 3010 కేసుల్లో శిక్షలు పడింది కేవలం 23 ఉదంతాల్లోనే, అందుకే వీటిని ప్రతిపక్ష నేతలమీద బెదిరింపు దాడులని ప్రజలు అనుకుంటున్నారు. ఏటా జీఎస్‌టీ 85వేల కోట్ల మేరకు ఎగవేస్తున్నట్లు బ్రిటన్‌కు చెందిన రుబిక్స్ సంస్థ అంచనా వేసింది. ఇలా అవినీతి గురించి ఎన్నయినా చెప్పుకోవచ్చు. ఇటీవలి కాలంలో సమాచార కేంద్రాల అనుసంధానం కారణంగానే చట్టబద్ధంగా జరిగే లావాదేవీలమీద నిఘాతోపాటు అక్రమాలను కనుగొనటం కూడా సులభతరమైంది. వాటి ఆధారంగా అక్రమార్కుల మీద తీసుకొంటున్న చర్యలే ప్రశ్నార్థకం. రెండవది అక్రమాలకు పాల్పడుతున్నవారు గతంలో మాదిరి నగదుతోనే పని నడిపిస్తున్నారు. అందుకే దాడులు జరిపితే టన్నులకొద్దీ నగదు పట్టుబడుతున్నది. పెద్దనోట్ల రద్దు తరువాత ఆర్థిక రంగంలో నగదు సరఫరా 17.7లక్షల కోట్ల నుంచి 32లక్షల కోట్లకు పెరిగింది. అవినీతి పెరుగుదలకు ఇదొక సూచిక. మోదీ సర్కార్ చెబుతున్నట్లు లావాదేవీలన్నీ బాంకుల ద్వారా జరిగితే ఇటీవల తెలంగాణాలోని మునుగోడు, అంతకు ముందు హుజూరాబాద్ ఉపఎన్నికల్లో వందల కోట్ల ఖర్చు గుట్టు వెల్లడి కావాలి. అలాంటిదేమీ లేదు.

బహిరంగ వేదికల మీద చెబుతున్న సుభాషితాలను చూస్తే దగా దగా కుడి ఎడమల దగా దగా అన్న మహాకవి శ్రీశ్రీ గుర్తుకు వస్తోంది. "నేను తినను ఇతరులను తిననివ్వను" ఇదీ నరేంద్రమోదీ జనానికి చెప్పిన మాటలు. జనం సొమ్ముకు చౌకీదారు(కాపలాదారు)నని కూడా చెప్పుకున్నారు. ఇంకేముంది ! అనుచర గణమంతా తమ పేర్ల చివర చౌకీదార్ అని తగిలించుకున్నారు. అందరూ జేజేలు పలికారు. అవినీతిని అంతం చేసే కొత్త దేవుడు దిగివచ్చారని ప్రచారం చేశారు. ఇంతకాలం తిన్న సొమ్మంతా అణాపైసలతో కక్కిస్తారని అనుకున్నారు. ఇప్పుడెవరూ చౌకీదార్ అని చెప్పుకోవటం లేదు. లోక్‌పాల్‌కు ఫిర్యాదులు ఎందుకు రావటం లేదంటే తమపాలనలో అవినీతి లేనపుడు ఫిర్యాదులు ఎలా వస్తాయంటూ బీజేపీ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. అవినీతి గురించి అందరికీ తెలిసినందున ఎవరికి తోచింది వారు అనుకోవచ్చు.

సంక్షోభం దిశగా ఐటీ పరిశ్రమ

కోవిడ్ సమయంలో ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాలు తీవ్ర సంక్షోభానికి గురయ్యాయి. అత్యధికులు ఉపాధిని కోల్పోయారు. ఆకలి మరణాలు సంభవించాయి. చాలా మంది చిన్నారులు అనాధులుగా మారారు. అయితే ఇంతటి క్లిష్ట సమయంలో కూడా ఐటీ రంగం మాత్రం ఒక వెలుగు వెలిగింది. ఎన్నో కొత్త నియామకాలు చేపట్టింది. ఉద్యోగులకు ఎన్నో ప్రోత్సాహకాలు అందించింది. పనిదినం వృధా కాకుండా కోవిడ్ సమయంలో వర్క్‌ఫ్రమ్‌హోం చేపట్టి ఉద్యోగులకు అదనపు సౌకర్యాలు అందిస్తూ ఐటీ రంగం అద్భుత ప్రగతి సాధించింది. ఈ సమయంలో నిపుణులైన ఉద్యోగులుకు అద్భుత అవకాశాలు లభించాయి. ప్రాంగణ నియామకాలు ఎక్కువగా జరిగాయి. ఇంతటి ప్రగతి సాధించిన ఐటీ రంగం నేడు తీవ్ర సంక్షోభంతో అతలాకుతలం అవుతోంది. ఈ సంక్షోభం ఒక్క దేశానికి చెందిన సమస్య కాదు ప్రపంచ వ్యాప్తంగా నేడు ఐటీ రంగంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. దీనికి గల కారణాలు పరిశీలిస్తే ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు అధిక ద్రవ్యోల్బణంతో అతలాకుతలం అవుతున్నాయి. ప్రధానంగా దీనిని అదుపుచేసే ఉద్దేశ్యంతో ద్రవ్య చలామణిని అరికట్టడానికి తొలుత అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ వడ్డీరేట్లను పెంచింది. మిగిలిన దేశాలు కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తున్నాయి. మన దేశానికి చెందిన రిజర్వ్ బ్యాంక్ కూడా వడ్డీరేట్లను పెంచుతూ వచ్చింది. దీనికి తోడు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కూడా ఆరంభం కావడం వెరసి ఆర్థిక మాంద్యం ముంచుకు వస్తుందనే భయాలు పెరిగాయి. అంతే కాదు ఆ సంకేతాలు రోజురోజుకు ఉధృతమవుతూ వస్తున్నాయి. కోవిడ్ విపత్తులో కూడా చెక్కు చెదరకుండా అభివృద్ధి బాటలో కొనసాగిన ఐటీరంగంపై ఇది పెను ప్రభావం చూపనుంది. మున్ముందు ఈ రంగంలో 2008 నాటి గడ్డు పరిస్థితులు పునరావృతంఅయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వీస్తున్న మాంద్యం గాలులు ఐటీ రంగాన్ని నేరుగా తాకాయి.

మారుతున్న ఈ పరిస్థితులలో మాంద్యం తీవ్రత రానున్న 6నెలల నుంచి సంవత్సరంలోపు ఐటీ రంగానికి ఎక్కువగా ఉంటుందని ప్రపంచ దేశాల సీఈఓలు సైతం హెచ్చరిస్తున్నారు. ఈ హెచ్చరికలు దృష్టిలో ఉంచుకుని టెక్ కంపెనీలు ఇప్పటికే దిద్దుబాటు చర్యలు మొదలెట్టాయి. వ్యయ నియంత్రణకై విభిన్న మార్గాలు అమలుపరుస్తూ కంపెనీల ఉనికిని కాపాడుకోవడానికి సతమతం అవుతున్నాయి. దీనిలో భాగంగా చిన్న ఐటీ కంపెనీలే కాదు బడా కంపెనీలు సైతం ఉద్యోగులను తొలగించడంలో తమ వ్యూహాలను అమలు పరుస్తున్నాయి. కొత్తగా ప్రాంగణ నియమకాలు తగ్గి పోయాయి. క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎన్నో వడపోతల మధ్య ఎంపికచేసిన అభ్యర్థులకు ఆఫర్ లెటర్ వచ్చినప్పటికి ఉద్యోగం లభిస్తుంది అనే నమ్మకం నేడు లేకుండా పోయింది. ఆఫర్ లెటర్ విషయమై అభ్యర్థులు వివరణ కోరుతూ ఉంటే సమాధానం ఇచ్చే వాళ్ళే కరువయ్యారు. కొన్ని కంపెనీలు ఆఫర్ లెటర్ ఇచ్చిన వారికి మీకు వేరొక మంచి అవకాశం వస్తే ఉపయోగించుకోండి అంటూ ఉచిత సలహాలు కూడా ఇస్తున్నాయి. మరి కొన్ని కంపెనీలు ఇచ్చిన ఆఫర్ లెటర్లు కూడా వెనక్కి తీసుకుంటున్నాయి. హెచ్చు వేతనాలు తీసుకునే నిపుణుల వేతనాలలో సైతం కోతలు మొదలు పెట్టారు. ఉద్యోగులుకు ఇచ్చే వేతనాల పెంపు వాయిదా వేయడం లేదా తక్కువ పెంపుతో సరిపెట్టే చర్యలు ద్వారా ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. ప్రమోషన్ల సంగతి సరే సరి.

ఉద్యోగుల భారాన్ని తొలగించుకోవడానికి కొన్ని కంపెనీలు మూన్‌లైటింగ్ అనేది ఒక సాకుగా చూపించి ఉద్యోగులను తొలగిస్తున్నాయి. మరి కొన్ని ఉద్యోగిలో సరైన నైపుణ్య ప్రమాణాలు లేవు అంటూ తీసేస్తున్నాయి. ఐటీ బూమ్ ఉన్న సమయంలో ఈ లోపాలు కంపెనీలకు కనిపించలేదు. ఇటువంటి సందర్భంలో నూతన నియామకాలు విషయం పక్కన పెడితే గతంలో ఉన్న ఉద్యోగులకే తమ ఉద్యోగం ఉంటుందో ఊడుతుందో అన్న గ్యారంటీ లేకుండా పోయింది. ఈ సందర్భంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలు మొదలయ్యాయి. మరొక పక్క ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని ప్రాంగణ నియామకం కోసం ఎదురుచూస్తున్న వారికి నిరాశ నిస్పృహలు మొదలయ్యాయి. ఇవన్నీ చూస్తే ఐటీ రంగంలో సంక్షోభం ఆరంభం అయ్యిందనే చెప్పాలి. ఎందుకంటే ఇప్పటికే మాంద్యం ప్రభావం ఐటీపై స్పష్టంగా కనిపిస్తోంది. యాపిల్, గూగుల్, ఫేస్‌బుక్



వంటి దిగ్గజ కంపెనీలు ఖర్చులను తగ్గించుకునేందుకు సిద్ధమయ్యాయి. ఉద్యోగులను క్రమంగా తగ్గించుకోవడం, తొలగించడం, లే ఆఫ్స్ ఇవ్వడం, కొత్త నియామకాలు ఆపడం వంటివి చేస్తున్నాయి. అమెరికాలో అయితే ఈముప్పు పేరిట విభిన్న టెక్ కంపెనీలు ఇప్పటికే దాదాపు 45వేల మందిని తొలగించాయి. ఈ నేపథ్యంలో భారత్ ఐటీ రంగానికి రానున్నది గడ్డు కాలమే అని చెప్పవచ్చు. కొత్తప్రాజెక్టులు వస్తాయి అనే నమ్మకం లేకుండా పోయింది. అయితే భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సంక్షోభాలను చూసింది. వాటిని ధీటుగా ఎదుర్కొంది. అలాగే ప్రస్తుతం అమెరికా, యూరప్‌లలో నెలకొన్న తాజా ఆర్థిక మాంద్యం మన దేశ ఆర్థికవ్యవస్థపై మాత్రం ప్రభావం చూపబోదని కొందరు నిపుణులు చెబుతున్నారు, వీరి ధీమాకు కారణమేమంటే ప్రపంచ సాఫ్ట్‌వేర్ రంగంలో మన దేశం కీలకపాత్ర వహిస్తోంది. విదేశీ ఐటి దిగ్గజాలకు ధీటుగా సమాధానం చెప్పగల కంపెనీలు ఇప్పుడు మన దేశంలోనే ఉన్నాయి. కేవలం గడచిన 20 ఏళ్లలోనే అమెరికా, యూరప్ దేశాల ఐటి కంపెనీలకు సరితూగే కంపెనీలు ప్రస్తుతం మనదేశంలో కూడా ఉన్నాయి. మరిన్ని సదుపాయాలు ఉన్నప్పుడు మనం భయపడాల్సిన అవసరం లేదు అనేది కొందరి ఆశావాహుల దృక్పథం. అయితే భారతదేశ ఐటీరంగం దేశీయంగా నిర్వహిస్తున్న కార్య కలాపాల కంటే అంతర్జాతీయంగా వివిధదేశాల కోసం నిర్వహిస్తున్న కార్య కలాపాలే ఎక్కువ. అంటే మనదేశ ఐటీ రంగం దాదాపుగా విదేశీ మార్కెట్లపైనే ఆధారపడి ఉందని అర్థం.

భారత ఐటీ రంగం ఇంత బలంగా తయారయ్యేందుకు ప్రధాన కారణం అమెరికా, ఐరోపా దేశాలే. కారణమేమంటే భారత ఐటీ దిగ్గజ కంపెనీలకు పెద్ద ఎత్తున క్లయింట్స్ ఆర్డర్లు ఈ దేశాల నుంచే వస్తాయి కనుక అక్కడ ఆర్థికవ్యవస్థ సరిగా లేకుంటే అది భారత ఐటీ కంపెనీలను కకావికలం చేసే అవకాశముంది. అమెరికా ఐరోపా దేశాలకు ఐటీ సేవలు అందిస్తూ విదేశీ వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయాలతోనే మన ఐటి కంపెనీలు నిలదొక్కుకుంటున్నాయి. భారత దిగ్గజ ఐటీ కంపెనీలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ రెవెన్యూల్లో దాదాపు 80 శాతానికిపైగా ఉత్తరఅమెరికా, యూరోపియన్ మార్కెట్ల నుంచే వస్తుందంటేనే పరిస్థితి మనం అర్థం చేసుకోవచ్చు. అందుకే ఒక్కసారి ఆ దేశాల్లో ఐటీ కంపెనీలు దెబ్బతింటే.. అది భారత ఐటీ కంపెనీలు, ఉద్యోగులపై ఎంతగా ప్రభావితం చేస్తాయో అంచనా వేయడం పెద్ద కష్టమేం కాదు. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకునే దేశీయంగా కూడా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఉద్యోగులకు లే ఆఫ్స్ ఇచ్చినట్లు వార్తలొచ్చాయి. విప్రో కూడా మూన్‌లైటింగ్ పేరిట 300 మందిని తొలగించింది. హ్యాపీయెస్ట్‌మైండ్స్ అనే ఐటీకంపెనీ కూడా ఉద్యోగులను తొలగించినట్లు చెప్పుకొచ్చింది. ఇక టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్ వంటి ఐటీ కంపెనీలే పలువురు ఫ్రెషర్స్‌కు ఆఫర్ లెటర్స్ ఇచ్చి మళ్లీ రద్దు చేసుకున్నట్లు మీడియాలో వార్తలొస్తున్నాయి. అసెంచర్ అయితే తమ ఉద్యోగులలో ఫేక్ ధ్రువపత్రాలు పెట్టి కొనసాగుతూ ఉన్నవారిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. గత సంవత్సరం ఆక్టోబర్‌తో పోలిస్తే ప్రస్తుత సంవత్సరం ఆక్టోబర్ నాటికి 18శాతం నియామకాలు తగ్గాయని వివిధ నివేదికలు చెబుతున్నాయి. వేతనాల పెంపు విషయంలో కూడా నీలినీడలు కమ్ముకోవడం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రుద్రరాజు శ్రీనివాసరాజు, 9441239578

రాజ్యాంగంపై నిరంతర దాడి

- దళితులు, గిరిజనుల హక్కులు హననం
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ మండిపాటు

వశీం: రాజ్యాంగంపై బీజేపీకి ఏమాత్రం విశ్వాసం, గౌరవం లేదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. రాజ్యాంగంపై ప్రతిరోజు దాడి చేస్తోందని, రాజ్యాంగం కల్పించిన హక్కులను దళితులు, గిరిజనులు, పేదలు అనుభవించడాన్ని కాషాయ పార్టీ భరించలేకపోతోందని ఆరోపించారు. భారత్ జోడో యాత్రలో భాగంగా మహారాష్ట్రలోని వశీం జిల్లాలో మంగళవారం జరిగిన గిరిజన సమరయోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా రాహుల్ ప్రసంగించారు. దేశ అసలు యజమానులు గిరిజనులేనని రాహుల్ చెప్పారు. ఏ హక్కులైనా గిరిజనుల తర్వాతేనని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు. బిర్సా ముండా ఆలోచనలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. దళితులు, ఆదివాసీలు, పేదలంటే బీజేపీకి గిట్టదని, అందుకే వారి హక్కులపై నిరంతరం దాడులు చేస్తోందని రాహుల్ అన్నారు.

అసలైన రాహుల్‌ను చూస్తారు: జైరాం రమేశ్

భారత్ జోడో యాత్ర రాహుల్‌గాంధీని పూర్తిగా మార్చి వేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ చెప్పారు. ఇప్పుడు అసలు సిసలు రాహుల్‌గా పరిణతి చెందారని వ్యాఖ్యానించారు. రాహుల్ పాదయాత్ర హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు దోహదపడుతుందా అని విలేకరులు ప్రశ్నించగా రాహుల్ యాత్రకు, ఎన్నికలకు సంబంధమే లేదని జైరాం రమేశ్ స్పష్టంచేశారు. ఈ యాత్ర కేవలం 2024 ఎన్నికల కోసమేనని చెప్పారు. రాహుల్‌గాంధీ డెటాల్ లేదా ఫెవికాల్ బ్రాండ్ కాదని, కీలక అంశాలపై ఆయనకు స్పష్టమైన సొంత అభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు. భారత్ జోడో యాత్రకు ముందు రాహుల్‌ను ఏదో ఒకటీ, అరా అంశాలకే పరిమితం చేయాలని బీజేపీ ప్రయత్నించిందని, ప్రత్యేకించి సామాజిక మాధ్యమని అన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా కొత్త రాహుల్‌ను కాకుండా అసలైన రాహుల్‌ను చూస్తారని పేర్కొన్నారు. 3,370 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర ద్వారా నేరుగా ప్రజలతో రాహుల్ మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రజలు, రాహుల్ మధ్యవర్తులు అవసరం లేదని తెలిపారు. ఇప్పుడు ప్రజలు నిజమైన రాహుల్‌ను చూస్తున్నట్లు భావిస్తున్నారన్నారు. కన్యాకుమారిలో ప్రారంభమైన రాహుల్ యాత్ర ఆరు రాష్ట్రాల్లో 28 జిల్లాలను చుట్టివచ్చింది. రాహుల్ పాదయాత్ర ఆయన కోసం కాదని, పార్టీ బలోపేతం కోసమని చెప్పారు. ఇది ఇంటింటి ప్రచారం. ఏళ్ల తరబడి ఇలాంటి ప్రయత్నం ఎవరూ చేయలేదు. ఈ అవకాశాన్ని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఉపయోగించుకుంటుందని వివరించారు. ప్రజలతో మమేకం కావాలన్న భావననే ఆము కూడా మర్చిపోయామని, ఏళ్లతరబడి అధికారంలో కొనసాగడం ఇందుకు కారణమని వ్యాఖ్యానించారు.

'నా తల సిగ్గుతో వణికిపోతోంది'

బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించకపోవడంపై ఢిల్లీ హైకోర్టు సీజే

న్యూఢిల్లీ: 'నా తల సిగ్గుతో వణికిపోతోంది' అని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మంగళవారం వ్యాఖ్యానించారు. ఈ సంవత్సరం మురుగు కాలువలో మరణించిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాల విషయంలో ఢిల్లీ అభివృద్ధి మండలి (డీడీఏ) 'పూర్తి సానుభూతి లేని వైఖరి'ని ప్రదర్శించడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని అక్టోబర్ 6న డీడీఏను ఆదేశిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు... ఈ ఘటనలో తమ కుటుంబానికి సంపాదించే ఏకైక వ్యక్తిని కోల్పోయిన వారికి ఆ మొత్తాన్ని బాధితులకు చెల్లించాలని అధికారులను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు డీడీఏ వైస్ చైర్మన్ మనీష్ గుప్తా విచారణకు హాజరయ్యారు. ఢిల్లీ శివార్లలోని ముండ్కా ప్రాంతంలో సెప్టెంబర్ 9న మురుగు కాలువలో విషవాయువులు పీల్చడంతో స్వీపర్, సెక్యూరిటీ గార్డు మరణించారు. ఓ స్వీపర్ మురుగు కాల్వను శుభ్రం చేసేందుకు దిగి స్పృహతప్పి పడిపోయిన ఘటన చోటుచేసుకుంది. అతనిని రక్షించడానికి పరుగెత్తిన ఒక సెక్యూరిటీ గార్డు కూడా స్పృహతప్పి పడిపోవడంతో ఇద్దరూ మరణించారు. ఈ ఘటనకు సంబంధించిన వార్తాకథనం ఆధారంగా న్యాయస్థానం స్వయంగా ప్రారంభించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించిన హైకోర్టు, బాధిత కుటుంబాలకు డీడీఏ ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చెల్లించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఒక్క పైసా కూడా' అధికారికంగా విడుదల కాలేదని అసహనం వ్యక్తం చేసింది. అయితే, ప్రత్యేక పరిహారంలో భాగంగా ఢిల్లీ ప్రభుత్వం రెండు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చెల్లించిందని, మిగిలిన రూ.9 లక్షలను వారికి 15 రోజుల్లోగా చెల్లిస్తామని పేర్కొంది. 'మన జీవితం సుఖంలా ఉండేలా పని చేసే వ్యక్తులతో మేము వ్యవహరిస్తున్నాం. ఇదీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు, పద్ధతి. చాలా దురదృష్టకరం' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. కాగా ఈ మొత్తాన్ని చెల్లించడం ఢిల్లీ ప్రభుత్వ విధి అని డీడీఏ తరపు న్యాయవాది తెలిపారు.

ఢిల్లీ స్థానిక ఎన్నికల్లో 2,012 నామినేషన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి మొత్తం 2,012 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. నామినేషన్ దాఖలుకు చివరి రోజు సోమవారం మూడు పార్టీలు-ఆప్, బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన మొత్తం 750 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. వీరితో పాటు ఇతర చిన్న పార్టీలు, అత్యధికంగా స్వతంత్రులు నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం తెల్లవారుజాము వరకు నామినేషన్లను అధికారులు స్వీకరించారు. 2,012 మంది అభ్యర్థులు 2,564 నామినేషన్లు వేశారు. నామినేషన్‌ల ప్రక్రియ ప్రశాంతంగా సాగినట్లు అధికారులు తెలిపారు. డిసెంబరు 4వ తేదీన పోలింగ్ జరుగుతుంది. 7న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 2017 కార్పొరేషన్ ఎన్నికల్లో 270 వార్డులకుగాను బీజేపీ 181 సీట్లు గెలిచింది. అభ్యర్థుల మృతితో రెండు సీట్లకు పోలింగ్ జరగలేదు. ఆప్ 48, కాంగ్రెస్ 27 వార్డుల్లో విజయం సాధించాయి. వార్డుల పునర్విభజన అనంతరం మొదటిసారి ఎన్నికలు జరుగుతున్నాయి.

కేరళ బీజేపీకి చుక్కెదురు

కొచ్చి: కేరళలో బీజేపీకి హైకోర్టులో చుక్కెదురైంది. రాజ్‌భవన్‌కు వామపక్షాలు తలపెట్టిన నిరసన ర్యాలీని నిలిపివేయాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అయితే, నిరసన ర్యాలీలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటున్నట్లు సురేంద్రన్ చేసిన ఆరోపణను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. నిరసన ర్యాలీలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నట్లు ఎలా గుర్తిస్తారని బీజేపీ అధ్యక్షుడి తరపు న్యాయవాదిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.మణికుమార్, జస్టిస్ షాజీ పి చాలేలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. వామపక్షాల నిరసనలో పాల్గొనాల్సిందిగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలే చూపించాలని నిలదీసింది. ఆందోళనకారుల్లో ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించం సాధ్యమా అని అడిగింది. నిరసన ర్యాలీలో పాల్గొనవద్దని తాము ఎలా ఆదేశాలు ఇవ్వాలని ప్రశ్నించింది. నిరసన ర్యాలీలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదన్నదే తమ ఉద్దేశమని సురేంద్రన్ తరపు న్యాయవాది వివరించారు. ప్రభుత్వం పంపిన బిల్లులు ఆమోదించాలని గవర్నరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారని న్యాయవాది చెప్పారు. అందుకే నిరసనలో పాల్గొనేలా ఉద్యోగులపై ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు.

స్కూళ్లకు కాషాయ రంగు

కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై వివాదం

బెంగళూరు: కర్ణాటకలో పాఠశాలలకు కాషాయ రంగు వేయాలన్న ప్రభుత్వ నిర్ణయం వివాదానికి దారి తీసింది. 'వివేక స్కీం'లో భాగంగా రాష్ట్రంలోని 8,10 తరగతి గదుల్లో ఈ రంగు వేయాలని నిర్ణయించింది. అయితే, కాషాయ రంగుపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. హిందూత్వ అజెండాను విద్యార్థులపై రుద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశాయి. కానీ, వివేకానందుడు ఆ రంగు వస్త్రాలనే ధరించారని, ఆ ఉద్దేశంతోనే కాషాయ రంగును వేయాలని నిర్ణయించినట్టు సీఎం బొమ్మై సమర్థించుకుంటున్నారు. జాతీయ జెండాలోనూ కాషాయ రంగు ఉన్నదని చెప్పారు. ఈ వివరణపైనా ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. మరి అలాంటప్పుడు జాతీయ జెండాలోని మూడు రంగులను ఎందుకు వాడలేదని నిలదీశాయి. ఇటీవల పుస్తకాల్లోంచి భగత్‌సింగ్, టిప్పుసుల్తాన్, లింగాయత్ సంఘసంస్కర్త బసవన్న, పెరియార్, నారాయణగురుకు సంబంధించిన అంశాలను ఆ రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. ఈ నేపథ్యంలో కర్ణాటకలో విద్యావ్యవస్థ కాషాయీకరణ చేస్తున్నాంని అనేక మంది విశ్లేషకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మిజోరంలో అంతర్జాతీయ పర్యాటక మేళా

ఐజ్వాల్: మిజోరంలో నవంబర్ 16 నుంచి నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ పర్యాటక మేళా జరగనుంది. ఇటువంటి భారీ కార్యక్రమాలకు రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. ఈశాన్య ప్రాంత ప్రత్యేకతను, సామర్థ్యాన్ని చాటేందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, మిజోరం పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి రాబర్ట్ రొమావియా రాయ్తే మంగళవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. బిజినెస్-టు-బిజినెస్ సెషన్‌లు, బృంద చర్చలు, ఈశాన్య ప్రాంతంలోని ఎనిమిది రాష్ట్రాల నుంచి సమర్పణలతో కూడిన కార్యక్రమాల సన్నాహాలు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. ఇందు కోసం కేంద్రం రూ. 4.3 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ ఆర్. లాల్తాంగ్లియానా అసోం రైఫిల్స్ మైదానంలో పర్యాటక మేళాను ప్రారంభించనున్నారు.

గుజ్జర్లు, బకర్‌వాల రిజర్వేషన్లకు డోకా లేదు

కశ్మీర్ ఎల్జీ మనోజ్‌సిన్హా

జమ్ము: జమ్ముకశ్మీర్‌లో పహారీ సామాజిక వర్గానికి రిజర్వేషన్లు మంజూరు చేయడం వల్ల గుజ్జర్, బకర్‌వాల వర్గాల కోటాపై ఎలాంటి ప్రభావం ఉండదని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మంగళవారం తెలిపారు. ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పహారీ వర్గానికి రిజర్వేషన్ల మంజూరుపై రాజౌరీ, బారాముల్లా పర్యటన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనను ప్రస్తావించారు. 'కొందరు రాజకీయ కారణాలతో కమ్యూనిటీలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారు... అయితే గుజ్జర్లు, బకర్‌వాల, గడ్డీలు, సిప్పీల రిజర్వేషన్ కోటాలో ఎటువంటి మార్పు ఉండదని నేను విశ్వాసంతో, బాధ్యతతో పునరుద్ఘాటిస్తున్నాను' అని సిన్హా అన్నారు. పహారీలకు ఎస్టీ హోదా ఇవ్వడానికి కేంద్రం తీసుకున్న చర్యకు వ్యతిరేకంగా గుజ్జర్లు, బకర్‌వాలలు లోయలో నిరసనలు నిర్వహిస్తున్నారు.

సీఎం సొరేన్ అభ్యర్థనకు ఈడీ తిరస్కరణ

రాంచి: అక్రమ మైనింగ్ ఆరోపణలకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో తనకు పంపిన సమన్ల తేదీని సవరించాలన్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ అభ్యర్థనను ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ) నిరాకరించింది. ఈ కేసులో విచారణకుగాను నవంబరు 17న హాజరు కావాలని ఈడీ ఇప్పటికే జేఎంఎం నేతకు సమన్లు జారీ చేసింది. అయితే ఒకరోజు ముందు అంటే నవంబరు 16న విచారణకు హాజరు కావడానికి అనుమతించాలని సీఎం సొరేన్ కోరారు. వాస్తవంగా నవంబరు 3వ తేదీన సొరేన్ విచారణకు హాజరు కావాల్సి ఉంది. కానీ ఆయన అధికారిక కార్యక్రమాలు ఉన్నందున రాలేనని ఈడీకి తెలిపారు. మూడు వారాలు గడువు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో సొరేన్ రాజకీయ సహాయకుడు పంకజ్ మిశ్రా, మరో ఇద్దరు బచ్చు యాదవ్, ప్రేమ్ ప్రకాశ్‌లను ఈడీ ఇప్పటికే అరెస్టు చేసింది. రాష్ట్రంలో రూ.1000 కోట్ల మేరకు అక్రమ మైనింగ్ జరిగినట్లు గుర్తించామని ఈడీ చెబుతోంది. తనకు సమన్లు పంపడానికి బదులు తాను తప్పుచేస్తే అరెస్టు చేయండని సొరేన్ ఇంతకుముందు సవాల్ విసిరారు.

గిరిజనుల నుంచి అటవీ సంరక్షణ నేర్చుకోవాలి

రాష్ట్రపతి ముర్ము

షాదోల్ (మధ్య ప్రదేశ్): వాతావరణ మార్పు, భూతాపం వంటి సమస్యల వల్ల ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని అటవీ సంరక్షణ గురించి గిరిజనుల నుంచి నేర్చుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం తెలిపారు. షాదోల్ జిల్లా, లాల్‌పూర్ గ్రామంలో జరిగిన 'జనజాతీయ గౌరవ్ దివస్' కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. 'నేడు, వాతావరణ మార్పు, భూతాపం వంటి సమస్యలు ప్రపంచానికి పెను సవాలుగా మారాయి. గిరిజనుల జీవనశైలి, అడవులను సంరక్షించే వారి సంకల్పం నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉంది' అని ముర్ము అన్నారు. బ్రిటీష్ పాలనలో అటవీ ప్రాంతాల పరిరక్షణకు గిరిజన సమాజం చేసిన పోరాటాన్ని రాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు. వారు కూడా ఈ లక్ష్యం కోసం తమ జీవితాలను త్యాగం చేశారని అన్నారు. గిరిజన సమాజం మానవులకు, వృక్షసంపదకు సమాన ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రాష్ట్రపతి రెండు రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నారు.

ఓటుకు లంచం...

చట్టసభ సభ్యులపై విచారణకు

అమికస్ క్యూరీ నియామకం



న్యూఢిల్లీ: పార్లమెంటు లేదా శాసనసభలో ప్రసంగం చేయడానికి లేదా ఓటు వేయడానికి లంచం తీసుకున్నందుకు ఒక ఎంపీ లేదా ఎమ్మెల్యే నేర విచారణ నుంచి మినహాయింపు పొందవచ్చో లేదో పరిశీలించడానికి సీనియర్ న్యాయవాది పీఎస్ పట్వాలియాను సుప్రీం కోర్టు మంగళవారం అమికస్ క్యూరీగా నియమించింది. జస్టిస్ ఎస్.ఎ.నజీర్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం... ఈ విషయంలో పట్వాలియాకు సహకరించాల్సిందిగా న్యాయవాది గౌరవ్ అగర్వాల్‌ను కోరింది. న్యాయమూర్తులు బిఆర్ గవాయి, ఎఎస్ బోపన్న, వి.రామసుబ్రమణియన్, బి.వి.నాగరత్నతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని డిసెంబరు 6న విచారించనున్నట్లు తెలిపింది. 2019లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని న్యాయమూర్తులు ఎస్.అబ్దుల్ నజీర్, సంజీవ్ ఖన్నాతో కూడిన ధర్మాసనం ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి కీలకమైన ప్రశ్నను సూచించింది. ఇది 'విస్తృతమైన ప్రభావం', 'గణనీయమైన ప్రజా ప్రాముఖ్యత' అని పేర్కొంది. జార్ఖండ్‌లో జామా నియోజకవర్గానికి చెందిన జేఎంఎం ఎమ్మెల్యే సీతా సొరెన్ దాఖలు చేసిన అప్పీల్‌పై సంచలనాత్మక జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) లంచం కేసులో 24 ఏళ్ల నాటి తీర్పును పునః సమీక్షిస్తున్నట్లు త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. పీవీ నరసింహా రావు వర్సెస్ సీబీఐ కేసులో 1998లో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు, పార్లమెంటు సభ్యులకు రాజ్యాంగం ప్రకారం ఎటువంటి ప్రసంగం, ఓటు వేసినా నేర విచారణకు వ్యతిరేకంగా రాజ్యాంగం ప్రకారం మినహాయింపు ఉందని పేర్కొంది. 2012లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఫలానా అభ్యర్థికి ఓటు వేయడానికి లంచం తీసుకున్నారనే ఆరోపణలతో తనపై నమోదయిన నేర కేసును కొట్టివేయడానికి నిరాకరించిన జార్ఖండ్ హైకోర్టు 2014 ఫిబ్రవరి 17న ఉత్తర్వులపై ఆమె అప్పీల్ చేశారు. ఒక అభ్యర్థి నుంచి లంచం తీసుకుని మరో అభ్యర్థికి ఓటు వేసినట్లు ఆమెపై సీబీఐ అభియోగాలు మోపింది. జేఎంఎం లంచం కేసులో కీలక నిందితుడుగా ఉన్న కేంద్ర మాజీ మంత్రి, జార్ఖండ్ ముఖ్యమంత్రి శిబు సొరెన్ కోడలు సీతా సొరెన్. 1993 జులైలో కేంద్రంలోని అప్పటి పీవీ నరసింహారావు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి శిబు సొరెన్ తన పార్టీకి చెందిన నలుగురు ఎంపీలతో కలిసి లంచం తీసుకున్నారని ఆరోపించారు.

ఎల్గార్ పరిషత్ కేసులో

నవలఖ విడుదలకు తొలగిన అడ్డంకి

గృహ నిర్బంధానికి సాల్వెన్సీ ధ్రువీకరణ అవసరం లేదన్న సుప్రీం



న్యూఢిల్లీ: ఎల్గార్ పరిషత్-మావోయిస్టు సంబంధాల కేసులో సామాజిక కార్యకర్త గౌతమ్ నవలఖ విడుదలకు గల అడ్డంకిని మంగళవారం సుప్రీం కోర్టు తొలగించింది. గృహనిర్బంధం ప్రయోజనం పొందేందుకు సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రం అవసరాన్ని రద్దు చేసింది. 70 ఏళ్ల నవలఖ రెండేళ్లుగా నవీ ముంబైలోని తలోజా జైల్లో ఉన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా నవలఖను ఒక నెలపాటు గృహనిర్బంధంలో ఉంచడానికి సుప్రీం కోర్టు నవంబరు 10న అనుమతించింది. గృహ నిర్బంధ సదుపాయాన్ని పొందేందుకు నవంబర్ 14లోగా నవ్‌లఖా రూ.2 లక్షల స్థానిక పూచీకత్తును అందజేస్తారని పేర్కొంది. కాగా జైలు నుంచి విడుదల చేసి గృహ నిర్బంధం చేసే లాంఛనాలకు సంబంధించి విచారించేందుకు ముంబైలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టులో హాజరు పర్చారు. అయితే సామాజిక కార్యకర్త గృహ నిర్బంధానికి ముందస్తు షరతుగా అందించడానికి పూచీకత్తుకు సంబంధించి సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను పొందేం దుకు కనీసం ఆరువారాల సమయం పడుతుందని నవలఖ తరపున హాజరయిన సీనియర్ న్యాయ వాది నిత్యా రామకృష్ణన్, న్యాయవాది షాదన్ ఫరాసత్ మంగళవారం న్యాయమూర్తులు కేఎం జోసెఫ్, హృషికేశ్ రాయ్‌తో కూడిన ధర్మాసనానికి తెలియజేశారు. 'అభ్యర్థన, పరిస్థితులను పరిగణన లోకి తీసుకుంటే, నవంబర్ 10, 2022 నాటి మా ఆదేశం ప్రయోజనాన్ని పొందేందుకు పిటిషనర్ (నవలఖ) కోసం సాల్వెన్సీ సర్టిఫికెట్ అవసరాన్ని మినహాయించడం సముచితమని మేము భావిస్తున్నాము. తదనుగుణంగా ఆదేశించాం' అని ధర్మాసనం పేర్కొంది. పాస్‌పోర్ట్, ఆధార్ కార్డు, పర్మినెంట్ అకౌంట్ నంబర్ (పాన్) కార్డ్ వంటి ఇతర తగిన భద్రతా రుజువులు అందించబడినందున, కింది కోర్టు సుప్రీం కోర్టు ఆదేశాల ప్రయోజనం పై ప్రభావం చూపేలా అదనపు గుర్తింపు రుజువుగా రేషన్ కార్డు కోసం పట్టుబట్టకూడదని పేర్కొంది. 'ఇది చాలా ఆదేశించబడింది' అని ధర్మాసనం తెలిపింది. కార్యకర్త ఏప్రిల్ 14, 2020 నుంచి కస్టడీలో ఉన్నారని, ప్రాథమికంగా అతని వైద్య నివేదికను తిరస్కరించడానికి ఎటువంటి కారణం లేదని సుప్రీం కోర్టు నవంబర్ 10న పేర్కొంది. నవలఖకు ఈ కేసు మినహా ఎలాంటి నేర నేపథ్యం లేదని, భారత ప్రభుత్వం కూడా అతన్ని మావోయిస్టులతో చర్చలు జరపడానికి మధ్యవర్తిగా నియమించినట్లు తెలిపింది. అతనికి భద్రత కల్పించడానికి ఖర్చుగా రూ.2.4 లక్షలు డిపాజిట్ చేయడంతో సహా అనేక షరతులు పెడుతూ, 70 ఏళ్ల కార్యకర్తను ముంబైలో నెల రోజుల పాటు గృహనిర్బంధంలో ఉంచాలన్న ఆదేశాలను 48 గంటల్లో అమలు చేయాలని సుప్రీం కోర్టు పేర్కొంది. 'ఈ కేసు మినహా, పిటిషనర్‌కు ఎలాంటి నేర నేపథ్యం లేదనేది వివాదం కాదు. 2011లో మావోయిస్టులు కిడ్నాప్ చేసిన భద్రతా సిబ్బందిని విడుదల చేయడం కోసం ఉగ్రవాదులతో మధ్యవర్తిత్వం వహించడానికి పిటిషనర్ సేవలను భారత ప్రభుత్వం మధ్యవర్తిగా ఉపయోగించుకున్నట్లు కూడా పిటిషనర్‌పై కేసు ఉంది' అని పేర్కొంది. 'పిటిషనర్‌ను గృహ నిర్బంధంలో ఉంచిన తేదీ నుంచి తదుపరి విచారణ తేదీ వరకు కనీసం గృహ నిర్బంధంలో ఉంచడానికి మేము అనుమతించాలని మేము వాస్తవాల దృష్ట్యా ఆలోచిస్తాము' అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. దీనిపై విచారణను డిసెంబరు 13కి సుప్రీం కోర్టు వాయిదా వేసింది. ముంబై సమీపంలోని తలోజా జైలులో తగిన వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలు లేవనే ఆందోళనలతో గృహనిర్బంధం కోసం చేసిన తన అభ్యర్థనను కొట్టివేస్తూ బాంబే హైకోర్టు ఏప్రిల్ 26న ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా సామాజిక కార్యకర్త సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు డిసెంబరు 31, 2017న పూణేలో జరిగిన ఎల్గార్ పరిషత్ సమావేశంలో చేసిన ఆరోపించిన ఉద్రేకపూరిత ప్రసంగాలకు సంబంధించినది. ఇది మరుసటి రోజు పశ్చిమ మహారాష్ట్ర నగర శివార్లలోని కోరెగావ్-భీమా యుద్ధ స్మారక చిహ్నం సమీపంలో హింసను ప్రేరేపించిందని పోలీసులు పేర్కొన్నారు.

కేరళలో కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బ

సీపీఎంలో చేరనున్న సీనియర్ నేత శ్రీధరన్

కాసరగడ్: కేరళలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. కేపీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత సీకే శ్రీధరన్ మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాకరన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శ్రీధరన్ ఆ పార్టీని వీడారు. రాజీనామా అనంతరం శ్రీధరన్ మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఫాసిజం, మతోన్మాదంపై సమర్థవంతంగా పోరాడుతున్న సీపీఎంలో తాను చేరబోతున్నట్లు ప్రకటించారు. 'కాంగ్రెస్‌ను వీడాలని నేను నిర్ణయించుకున్నాను. సీపీఎంతో కలిసి పనిచేయాలని నా భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకున్నాను. నవంబరు 17న అధికారికంగా ప్రకటిస్తాను' అని శ్రీధరన్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో విఫలమైందని ఆయన విమర్శించారు. 'దేశంలో కాంగ్రెస్ విఫలమైంది. నేడు భారత్‌లో ఫాసిజం, మతోన్మాదంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. దీనిని లెఫ్ట్‌ఫ్రంట్ సమర్థవంతంగా అమలు చేస్తోంది. కేపీసీసీ అధ్యక్షుడు ఇటీవల చేసిన బహిరంగ ప్రకటన సహా రాష్ట్ర నాయకత్వం వ్యాఖ్యలు, వైఖరి నేను పార్టీ వీడటానికి కారణమయ్యాయి' అని వివరించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సమక్షంలో శ్రీధరన్ త్వరలో ఆ పార్టీలో చేరబోతున్నారు. పొరపాటు చేసినట్లు ఆ తర్వాత సుధాకరన్ ప్రకటించినప్పటికీ ఇలాంటి ప్రకటనలు చేయడం వెనుక ఆయన ఉద్దేశం ఏమిటో తమకు తెలుసునని శ్రీధరన్ చెప్పారు. భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గొప్ప నాయకుడని, ఆర్ఎస్ఎస్ నేత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీతో పాటు నెహ్రూ ధైర్యసాహసాలను మనం చూశామని సుధాకరన్ వ్యాఖ్యానించారు. దీనిపై కాంగ్రెస్ కీలక భాగస్వామి ముస్లిం లీగ్(ఐయూఎంఎల్), పాలక సీపీఎం తీవ్రంగా మండిపడ్డాయి.

ఉత్తరాఖండ్‌లో కమీషన్‌రాజ్

సొంత ప్రభుత్వంపై మాజీ సీఎం సంచలన వ్యాఖ్యలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ ప్రభుత్వం కమీషన్ సర్కార్‌గా మారిపోయిందని ఆ రాష్ట్ర మాజీ సీఎం, బీజేపీ ఎంపీ తీరత్ సింగ్ రావత్ సొంత ప్రభుత్వం పైనే సంచలన ఆరోపణలు చేశారు. ఏ పని చేయాలన్నా కమీషన్ అడుగుతున్నారని విమర్శించారు. 'ఉత్తరప్రదేశ్ నుంచి మేం విడిపోకముందు అక్కడ 20 శాతం కమీషన్ ఉండేది. వేరే రాష్ట్రంగా మారాక ఈ సమస్య ఉండదని అనుకున్నా. కానీ, ఇప్పుడు ఉత్తరాఖండ్‌లోనూ 20 శాతం కమీషన్ కొనసాగుతున్నది' అని ఆయన మాట్లాడిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నది. ఉత్తరాఖండ్‌ను పాలిస్తున్నది బీజేపీయే. ఆ పార్టీకి చెందిన ఎంపీయే సంచలన వ్యాఖ్యలు చేయటం దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని లేపింది. వెంటనే ముఖ్యమంత్రి, మంత్రులు రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అటు బీజేపీ పాలిత కర్ణాటకలోనూ కమీషన్‌రాజ్‌పై ప్రతిపక్షాలు, కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఆ రాష్ట్రంలో ఏకంగా 40 శాతం కమీషన్ ఇవ్వాలని ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయని అనేక మంది బాధితులు వాపోయారు.

మోర్బి వంతెన కాంట్రాక్టు ఎలా?

- టెండర్లు పిలవకుండానే అప్పగింతా
- గుజరాత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

అహ్మదాబాద్: మోర్బి తీగల వంతెన దుర్ఘటనపై దాఖలయిన ఒక సుమోటో వ్యాజ్యాన్ని గుజరాత్ హైకోర్టు మంగళవారం విచారణ చేసింది. ఎలాంటి ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు లేకుండా, టెండర్లను పిలవకుండానే వంతెన మరమ్మతులు, నిర్వహణ కాంట్రాక్టును ఒకరికి ఏవిధంగా ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. గుజరాత్‌కు చెందిన మోర్బి జిల్లాలో అక్టోబరు 30న మచ్చూ నదిపై ఉన్న బ్రిటీషు కాలం నాటి తీగల వంతెన కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో మహిళలు, చిన్నారులు సహా 135 మంది మృతి చెందారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు... అజంతా మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఒరేవా గ్రూప్)తో 2008 అవగాహనా ఒప్పందం (ఎంవోయూ)-2022 ఒప్పందం ఫిట్‌నెస్ సర్టిఫికేషన్‌కు సంబంధించి ఏవైనా షరతులు విధించిందా లేదా అలా చేయడానికి అవసరమైన సమర్థ అధికారం ఎవరిదని రాష్ట్ర ప్రభుత్వం నుంచి తెలుసుకోవాలని కోరుకుంది. 'ఈ ఒప్పందం పూర్తిగా ఎలాంటి షరతులు లేకుండా ఒకటిన్నర పేజీల ఒప్పందం. ఈ అవగాహన ఒప్పందం ద్వారా పదేళ్లపాటు రాష్ట్రానికి పెద్దపీట వేసింది. టెండర్లు జరగలేదు. ఆసక్తిని వ్యక్తం చేయలేదు' అని ప్రధాన న్యాయమూర్తి అరవింద్ కుమార్, న్యాయమూర్తి అశుతోష్ శాస్త్రితో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. 'జూన్ 15, 2017తో ఆ పదవీ కాలం ముగిసిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం లేదా మోర్బి మున్సిపాలిటీ టెండర్ వేయడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నాయి? ఎలాంటి ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు వేయలేదు. రాష్ట్రానికి చెందిన పెద్ద మొత్తం ఒక వ్యక్తికి ఎలా ఇవ్వబడింది? టెండర్ వేస్తా... ఇంకా మున్సిపాలిటీని ఎందుకు భర్తీ చేయలేదు?' అని కోర్టు ప్రశ్నించింది. జూన్ 15, 2017న ఎంవోయూ ముగిసిన తర్వాత కూడా అజంతా (ఒరేవా గ్రూప్) ఎటువంటి ఒప్పందం లేనప్పటికీ వంతెన నిర్వహణ, నిర్వహణను కొనసాగించిందని కోర్టు గమనించింది. 2008 ఎంవోయూ 2017లో ముగిసిపోయిన తర్వాత వంతెన మరమ్మతులు, నిర్వహణ కోసం టెండర్‌ను తేవడానికి స్థానిక అధికారులు ఏమైనా చర్యలు తీసుకున్నారో లేదో రాష్ట్ర ప్రభుత్వం నుంచి తెలుసుకోవాలని కోరింది. నవంబర్ 7న బ్రిడ్జి కూలిన దుర్ఘటనపై వచ్చిన వార్తాకథనాన్ని తామే స్వయంగా స్వీకరించామని, దాని ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా నమోదు చేశామని హైకోర్టు నవంబర్ 7న తెలిపింది. గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ, మునిసిపాలిటీల కమిషనర్, మోర్బి మున్సిపాలిటీ, జిల్లా కలెక్టర్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ప్రాతినిధ్యం వహించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. అక్టోబర్ 31న, మోర్బి తీగల వంతెను నిర్వహిస్తున్న ఒరేవా గ్రూపునకు చెందిన నలుగురితో సహా తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరమ్మతులు, నిర్వహణకు బాధ్యత వహించే సంస్థల పై కేసు నమోదు చేశారు.

కాలికి చికిత్సకోసం వెళ్తే... ప్రాణమే పోయింది

చెన్నై: కాలికి గాయంతో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి వెళ్తే ఓ యువతి ప్రాణమే పోయిన విషాద ఘటన చెన్నైలో చోటు చేసుకుంది. ఓ 17ఏళ్ల ఔత్సాహిక ఫుట్‌బాల్ క్రీడాకారిణి కాలికి చేసిన శస్త్ర చికిత్స వికటించింది. దీంతో రక్త ప్రసరణ వ్యవస్థ దెబ్బతిని ఆరోగ్యం విషమించి చివరకు మంగళ వారం ఉదయం కన్నుమూసింది. అయితే, వైద్యుల నిర్లక్ష్యమే దీనికి కారణమంటూ బాధితురాలి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆరోపించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం.. ప్రాథమికంగా ఇద్దరు వైద్యులపై సస్పెన్షన్ వేటు వేసింది. ప్రియా (17) అనే ఔత్సాహిక ఫుట్‌బాల్ క్రీడాకారిణికి ఇటీవల కాలు నొప్పి రావడంతో చెన్నైలోని పెరియార్ నగర్‌లోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఆమెకు మోకాలి శస్త్రచికిత్స చేశారు. సర్జరీ అనంతరం దుష్ప్రభావాలు తలెత్తడంతో ప్రియను నగరంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. రక్త ప్రసరణలో ఇబ్బందులు ఉండటంతో యువతి కాలును తొలగించారు. అనంతరం పలు విభాగాల వైద్య నిపుణులు ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అయితే, రక్త ప్రసరణలో ఇబ్బందులు తలెత్తడంతో కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం పడి ఆ యువతి చివరకు ప్రాణాలు కోల్పోయింది. స్థానిక ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ప్రియ మరణించిం దంటూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. తప్పుడు చికిత్స వల్లే ప్రియ ప్రాణాలు కోల్పోయిందని అధికార డీఎంకేపై ప్రతిపక్ష నేత పళనిస్వామి మండిపడ్డారు. కాగా ప్రభుత్వం.. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన ఇద్దరు వైద్యులపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ప్రకటించింది. పూర్తి దర్యాప్తు తర్వాత వారిపై క్రిమినల్ చర్యలు ఉంటాయని పేర్కొంది. బాధిత కుటుంబానికి రూ.10లక్షల పరిహారం తోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ హామీ ఇచ్చినట్టు ఆరోగ్యశాఖ మంత్రి బాధిత కుటుంబానికి తెలిపారు.

దీక్ష విరమింపజేయండి

దక్షిణాసియా వర్సిటీ విద్యార్థుల సమస్యపై రాజా లేఖ

న్యూదిల్లీ: స్కాలర్‌షిప్‌ల కోసం దిల్లీలోని దక్షిణాసియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు చేస్తున్న నిరాహారదీక్ష సమస్యను పరిష్కరించాలని, దీనిపై వెంటనే జోక్యం చేసుకోవాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్‌ను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రికి రాజా లేఖ రాశారు. నిరాహారదీక్ష కారణంగా అనేకమంది విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని, ఆసుపత్రిపాలయ్యారని రాజా ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇది అంతర్జాతీయస్థాయి విశ్వవిద్యాలయమైనందున తీవ్ర పరిణామాలు ఎదురు కాకముందే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. తక్షణ ప్రాతిపదికపై సమస్య పరిష్కరించకపోతే, యాజమాన్యం తప్పిదాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు సంభవిస్తాయని, పొరుగుదేశాల్లో భారత్ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని రాజా హెచ్చరించారు. స్కాలర్‌షిప్ కోసం నిరాహారదీక్ష చేస్తున్న విద్యార్థులందరి ఆరోగ్యం క్షీణించిందన్నారు. 'విద్యార్థులు మానసికంగా, శారీకరంగా అపాయకర పరిస్థితుల్లో ఉన్నారు, తక్షణ ప్రాతిపదికపై స్పందించి వారి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల నిరాహారదీక్ష తొమ్మిదో రోజుకు చేరుకుంది, అందుకే ఈ లేఖ రాస్తున్నాను' అని రాజా పేర్కొన్నారు.

'విశ్వవిద్యాలయం విద్యార్థులు కేవలం కనీస స్కాలర్‌షిప్ మాత్రమే కోరుతున్నారు, మాస్టర్స్ విద్యార్థులకు ఐఎస్ఆర్ స్టైఫెండ్ రూ.7,000 వంతున ఇవ్వాలని అడుగుతున్నారు. వీరంతా సమాజంలో అణగారిన వర్గాల నుండి వచ్చిన వారే'నని తెలియజేశారు. యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లలో భారీగా కోత విధించారని విమర్శించారు. పీహెచ్‌డీ స్కాలరు ఇవ్వాల్సిన జేఆర్ఎఫ్ స్టయిఫెండ్ ఇవ్వట్లేదని, ఏడాదికాలంగా వాయిదా వేశారని తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో సార్క్ దేశాల సహకారంలో ఈ దక్షిణాసియా విశ్వవిద్యాలయం 2010లో ఢాకాలో జరిగిన 13వ సార్క్ సమావేశంలో ఆవిర్భవించిందని రాజా గుర్తు చేశారు. వివిధ రంగాలకు చెందిన కోర్సుల్లో ఈ యూనివర్సిటీ విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సార్క్ దేశాల విద్యార్థులు ఇక్కడికి వస్తారు. అంతర్జాతీయ ప్రాముఖ్యత గల విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ సమగ్రతకు ప్రాణంపోసే విధంగా సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు.ఈ విశ్వవిద్యాలయం సక్రమంగా పనిచేయడానికి వీలుగా ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కమిటీ, సమస్యల పరిష్కార కమిటీ, లైగింక వేధింపులకు వ్యతిరేకంగా స్త్రీ పురుష సమానత్వ కమిటీ వంటి కమిటీల బాధ్యులు, విద్యార్థులు నిరాహారదీక్షలో ఉన్నారు. శాంతియుతంగా విద్యార్థులు గాంధేయ పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారని, యూని వర్సిటీ యాజమాన్యం పోలీసులను పిలవాలని ఆలోచిం చిందని, శాంతిభద్రతల విభాగం జోక్యం చేసుకుంటే అది భారతదేశ ప్రతిష్ఠకు సంబంధించిన అంశంగా మారుతుందని, పొరుగుదేశాల దృష్టి పడుతుం దని ఆయన హెచ్చరించారు. యాజమాన్యం విద్యార్థులను నిరాశకు గురిచేస్తోందని రాజా విమర్శించారు.

కేతవరం భూములు తిరిగి స్వాధీనం

భూస్వాముల ఆగడాలు సహించం: సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: పేదలకు భూమి దక్కే వరకు పోరాటం ఆగదని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య స్పష్టంచేశారు. జంగారెడ్డిగూడెం మండల పరిధిలోని కేతవరం గ్రామంలో పేదలు, దళితులు సాగుచేసుకుంటున్న భూములను కృష్ణ చైతన్య, బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు నాయకత్వాన సీపీఐ బృందం మంగళవారం తిరిగి ఆక్రమించుకుంది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేతవరంలో 66 మంది పేదలు సాగు చేసుకుంటున్న భూములకు 1975లో అప్పటి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందని, అయినా భూస్వాములు ఆటంకాలు సృష్టించటం తగదన్నారు. ఈ భూములకు సంబంధించి జిల్లా న్యాయస్థానంలో పేదలకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయినా

అధికారం, ధనబలంతో పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పేదలకు భూమి దక్కే వరకు ఎర్రజెండా అండగా పోరాడుతుందని చెప్పారు. సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు, మండల సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు, మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, గొలిమే బాలయేసు, తాళ్లూరి నాగరాజు, మంచెళ్ల ప్రభాకర్‌తో పాటు కేతవరం గ్రామస్థులు పాల్గొన్నారు.

పెన్షన్ నిధులను కేంద్రం ఆపేసింది: భూపేశ్ బఘేల్

రాయ్‌పూర్: కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం నుంచి తమ రాష్ట్రానికి రావాల్సిన పెన్షన్ నిధులు రావడంలేదని ఆయన మండిపడ్డారు. ఏ కారణం లేకుండానే కేంద్రం పెన్షన్ నిధులు విడుదల చేయకుండా అట్టిపెట్టుకున్నదని విమర్శించారు.రాష్ట్రంలో తాము పాత పెన్షన్ స్కీమ్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) అమలు చేస్తున్నామని, దాని కోసం ఇప్పుడు నిధులు అవసరమని బఘేల్ చెప్పారు. పెన్షన్ డబ్బులు అంటే ఉద్యోగుల సొమ్ము అని, కాబట్టి కేంద్రం ఆ సొమ్మును వెంటనే రాష్ట్రానికి పంపాలని పేర్కొన్నారు. ఉద్యోగుల సొమ్మును కేంద్రం ఎలా ఆపుతుందని ప్రశ్నించారు.

శ్రద్ధా వాల్కర్ హత్యకేసులో విస్తుపోయే నిజాలు

ఆమె శరీర భాగాలు ఫ్రిజ్‌లో ఉండగానే...రూమ్‌కు మరో అమ్మాయి

న్యూదిల్లీ: సహజీవనం చేస్తున్న 26 ఏళ్ల శ్రద్ధా వాల్కర్‌ను 28 ఏళ్ల ఆఫ్తాబ్ అమీన్ పూనావాలా అత్యంత క్రూరంగా చంపిన విషయం తెలిసిందే. ప్రియురాలిని 35 ముక్కలు చేసి.. ఫ్రిజ్‌లో దాచి.. ఆ తర్వాత ఆమె శరీరా భాగాలను దిల్లీలోని వివిధ ప్రదేశాల్లో పడేశాడు. అయితే ఆ ఘటనకు చెందిన మరికొన్ని వివరాలను ఇవాళ పోలీసులు వెల్లడించారు. శ్రద్ధాను చంపి ఆమె శరీర భాగాలను ఫ్రిడ్జ్‌లో దాచి పెట్టిన సమయంలోనే.. తన రూమ్‌కు మరో గర్ల్‌ఫ్రెండ్‌ను అఫ్తాబ్ తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. అఫ్తాబ్, శ్రద్ధాలు బంబ్లీ డేటింగ్ యాప్ ద్వారా పరిచయం అయ్యారు. ముంబైలో ఆ ఇద్దరి మధ్య సాన్నిహిత్యం మొదలైంది. మూడేళ్ల పాటు సహజీవనం చేశారు. అయితే దిల్లీలో ఈ ఏడాది మే నెలలో శ్రద్ధాను అతను చంపేశాడు. శ్రద్ధాను చంపిన 20 రోజుల వ్యవధిలోనే అదే డేటింగ్ యాప్‌లో మరో అమ్మాయిని పరిచయం చేసుకున్నాడు. ఆమెతోనూ డేటింగ్ మొదలుపెట్టాడు. ఆ అమ్మాయిని కూడా పదేపదే ఇంటికి తీసుకువచ్చాడు. ఆ సమయంలో అపార్ట్‌మెంట్‌లోనూ శ్రద్ధ శరీర భాగాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 300 లీటర్ల ఫ్రిజ్ తీసుకువచ్చి.. సుమారు 35 శరీర భాగాలను దాంట్లో దాచాడు. అయితే కొత్త గర్ల్‌ఫ్రెండ్‌ను ఇంటికి తీసుకువచ్చిన సమయంలో ఆ ముక్కలను కప్‌బోర్డ్‌లోకి మార్చేశాడు. పెళ్లి చేసుకోవాలని శ్రద్ధ వత్తిడి చేయడం వల్లే ఆఫ్తాబ్ ఆమెను హత్య చేసినట్లు తెలుస్తోంది. శిక్షణ పొందిన చెఫ్ అయిన అఫ్తాబ్... రక్తపు మరకలను ఎలా క్లీన్ చేయాలి, మానవ శరీర నిర్మాణం గురించి గూగుల్‌లో సెర్చ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అతను వాడిన కత్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. శ్రద్ధా సజీవంగా ఉందని తెలిసేందుకు ఆమెకు చెందిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను అఫ్తాబ్ వాడాడు. ఆ అకౌంట్ ద్వారా శ్రద్ధా స్నేహితులతో అతను టచ్‌లో ఉన్నాడు. కానీ రెండు నెలలుగా ఫోన్ స్విచాఫ్ ఉండడంతో శ్రద్ధా ఫ్రెండ్స్‌కు అనుమానం వచ్చింది.

350 సినిమాల్లో 80 మల్టీస్టార్లే

విశాలాంధ్ర-హైదరాబాద్: కృష్ణ నటించిన సుమారు 350 సినిమాల్లో 80 మల్టీస్టార్లే ఉన్నాయి. ఆయన చేసిన సాహసాలు, పేల్చిన డైలాగులు, డ్యాన్స్ స్టెప్పులు కనిపిస్తే... ఇతర హీరోలతో కలిసి పంచిన వినోదం... ఒకటీ రెండు కాదు దాదాపు 80 మల్టీస్టార్‌ల చిత్రాలు చేసి కృష్ణ రికార్డు సృష్టించారు. మరో హీరోతో కలిసి నటించిన తొలి చిత్రం 'ఇద్దరు మొనగాళ్లు'. అందులో కాంతారావుతో కలిసి తెరను పంచుకున్నారు. ఆ తర్వాత ఈ కాంబోలో మరో రెండు చిత్రాలొచ్చాయి. 'పాతాళభైరవి' సినిమాలో ఎన్టీఆర్ నటనకు ముగ్ధుడైన కృష్ణ...

ఆయనతోనే కలిసి నటించే అవకాశం రావడం గురించి ప్రత్యేకంగా చెప్పేవారు. ఎన్టీఆర్‌తో కలిసి కృష్ణ నటించిన తొలి సినిమా 'స్త్రీ జన్మ'. తర్వాత, ఈ కాంబినేషన్‌లో 'నిలువు దోపిడి', 'విచిత్ర కుటుంబం', 'దేవుడు చేసిన మనుషులు', 'వయ్యారి భామలు-వగలమారి భర్తలు' సినిమాలొచ్చాయి. ఈ ఐదు చిత్రాల్లోనూ ఈ ఇద్దరు హీరోలు సోదరులుగా నటించడం విశేషం. తనకు స్ఫూర్తినిచ్చిన అక్కినేనితో కలిసి 'మంచి కుటుంబం', 'అక్కాచెల్లెలు', 'హేమాహేమీలు', 'గురుశిష్యులు', 'ఊరంతా సంక్రాంతి', 'రాజకీయ చదరంగం' సినిమాల్లో నటించారు. కృష్ణతో కలిసి ఎక్కువ సినిమాలు చేసిన నటుడిగా కృష్ణంరాజు నిలిచారు. వీరు కలిసి నటించిన 19 చిత్రాలు... వీరి అనుబంధం ఎలాంటిదో నిరూపించాయి. శోభన్‌బాబుతో 13, మోహన్‌బాబుతో 4, కాంతారావుతో 3, శివాజీ గణేశన్‌తో 3, రజనీకాంత్‌తో 3, సుమన్‌తో 3, నాగార్జునతో 2, చిరంజీవి, బాలకృష్ణ, రాజశేఖర్, హరికృష్ణ, రవితేజలతో ఒక్కో సినిమా చేసిన కృష్ణ తన

కొడుకులు రమేశ్‌బాబుతో 5, మహేశ్‌బాబుతో 7 చిత్రాల్లో కనిపించారు. నటుడిగా కృష్ణ తొలి అడుగులోనే సాహసం చేశారు. అగ్ర హీరోల సినిమాలే రాణిస్తున్న రోజుల్లో దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు కొత్త వారితో ఓ సినిమా చేయాలనుకున్నారు. పైగా కలర్ ప్రింట్‌లో. ఎంతోమంది సినీ పెద్దలు దానిపై పెదవి విరిచారు. అటు దర్శకుడు, ఇటు కృష్ణ వారి మాటలేం పట్టించుకోకుండా తమ పని తాము చేశారు. 'తేనె మనసులు' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మనసును దోచారు. 'బసవరాజు' పాత్ర పోషించిన కృష్ణ కంటే 'చిట్టిబాబు' క్యారెక్టర్ ప్లే చేసిన రామ్ మోహన్‌పై ప్రేక్షకులు ప్రశంసలు కురిపించారు. 'ఆంధ్రా దేవానంద్'లా ఉన్నాడంటూ కీర్తించారు. కట్ చేస్తే, నిర్మాత డూండీ మాత్రం కృష్ణ ఆ సినిమాలో చేసిన ఓ రిస్క్‌షాట్‌కు ఫిదా అయ్యారు. వెండితెరపై ట్రిగ్గర్ పేల్చే శక్తి అతనికే ఉందని కనిపెట్టారు. 'మా సినిమాలో నటిస్తావా?' అని అడగడమే ఆలస్యం కృష్ణ ఓకే చెప్పేశారు. అలా వచ్చిందే 'గూఢచారి 116'. దీంతోనే కృష్ణ 'ఆంధ్రా జేమ్స్‌బాండ్'గా మారారు. కృష్ణకు ఇది మూడో సినిమా. కెరీర్ ప్రారంభంలోనే ఇంతటి విజయాన్ని అందుకోవడం ఆయనకే చెల్లింది. 'నట శేఖర' అనేది కృష్ణ బిరుదు. కానీ, డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా పిలుచుకోవడంలోనే అభిమానులకు ఆనందం. 'సింహాసనం' సినిమా 70 ఎం.ఎం.లో వచ్చిన తొలి చిత్రంగా రికార్డుకెక్కింది. బాలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు బప్పీ లహరి, నటి మందాకిని, నటుడు అంజాద్ ఖాన్‌లు ఈ సినిమాతోనే తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు.



'ఆంధ్రా కౌబాయ్'గా...

1960ల్లో 'గుడ్ బ్యాడ్ అండ్ అగ్లీ', 'మెకానస్ గోల్డ్' వంటి చిత్రాలు విడుదలై హాలీవుడ్‌లో ప్రభంజనం సృష్టించాయి. అలాంటి కౌబాయ్ ప్రపంచాన్ని తెలుగు ప్రేక్షకులకు చూపించాలనుకున్న కృష్ణ ఎన్ని సమస్యలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. 'కౌబాయ్ సినిమాలంటే గుర్రపు స్వారీలు, భారీ బడ్జెట్' అంటూ పలువురు సూచించగా ఏం ఫర్వాలేదంటూ కృష్ణ ముందుకుసాగారు. 'తెలుగులో కౌబాయ్ సినిమానా?' సినీ పండితుడిగా, సినీ మాంత్రికుడిగా పేరు గడించిన ఓ నిర్మాత ఆ సినిమా విజయం సాధించదని జోస్యం చెప్పారట. కానీ, 'మోసగాళ్లకు మోసగాడు' ఎవరూ ఊహించని హిట్‌గా నిలిచింది. ఈ సినిమా నుంచి కృష్ణ 'ఆంధ్రా కౌబాయ్'గా గుర్తింపు పొందారు. అయినా ఆయన సంతృప్తి చెందలేదు. ఇంకా ఏదో చేయాలని పరితపిస్తున్న సమయంలోనే విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితాధారంగా ఓ సినిమా తీస్తే బాగుంటుందనుకున్నారు. అప్పటికే అల్లూరి కథను తెరపైకి తీసుకొచ్చేందుకు ఎన్టీఆర్ సన్నద్ధమవుతున్నారు. ఎట్టకేలకు కృష్ణనే అల్లూరి సీతారామరాజుగా మారారు. సినిమా స్కోప్ విధానంలోనే సినిమా పూర్తి చేశారు. 1974లో విడుదలైన ఈ సినిమా కనీవినీ ఎరగని విజయాన్ని దక్కించుకుంది. 'వెండితెర విప్లవజ్యోతి'గా కృష్ణ అవతరించారు.'తెలుగు వీర లేవరా'తో 'డి.టి.ఎస్'ను, 'ఈనాడు' చిత్రంతో 'ఈస్ట్‌మన్ కలర్' ఫార్మాట్‌ను తెలుగు తెరకు పరిచయం చేశారు. భావోద్వేగభరిత, రైతు పాత్రలు, పౌరాణికాల్లోనూ తన మార్క్ చూపించారు. 'దేవదాసు', 'కురుక్షేత్రం', 'పాడిపంటలు', 'పండంటి కాపురం' తదితర చిత్రాలు ఇందుకు ఉదాహరణగా నిలిచాయి. రాజకీయ నేపథ్య సినిమాల్లోనూ కృష్ణది అందవేసిన చెయ్యి. 'ముఖ్యమంత్రి', 'నా పిలుపే ప్రభంజనం', 'రాజకీయ చదరంగం', 'సాహసమే నా ఊపిరి' తదితర సినిమాలు అప్పట్లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాయి.

'ఆకాశంలో ఒక తార' పాట కోసం కొత్త గాయకుడు...

తెలుగు ప్రేక్షకులు ఘంటసాల గొంతు మాత్రమే విన్నారు. రామకృష్ణ గానాన్నే ఆస్వాదించారు. బాలసుబ్రహ్మణ్యం గాన మాధుర్యానికి తరించారు. ఎస్పీ బాలుతో కృష్ణకు అప్పట్లో మనస్పర్థలు వచ్చాయి. దాంతో 'కొత్త గాయకుడు పాడినా వింటారు' అన్న ధోరణిలో రాజ్ సీతారామ్‌ను పరిచయం చేశారు. ఆ పాటే 1986లో విడుదలై సంచలనం సృష్టించిన 'ఆకాశంలో ఒక తార నాకోసమొచ్చింది ఈ వేళ' (సింహాసనం). బాలుకు అవకాశాలు లేనప్పుడు తన ఇతర సినిమాల్లో పాటలు పాడించుకున్నారంటే కృష్ణ వ్యక్తిత్వం ఎలాంటిదో అర్థంచేసుకోవచ్చు.





'మోసగాళ్లకు మోసగాడు'

రాజకీయ, సినీ ప్రముఖుల ఘన నివాళి

విశాలాంధ్ర-హైదరాబాద్: సూపర్‌స్టార్ కృష్ణ భౌతికకాయాన్ని అనేక మంది సినీనటులు, రాజకీయ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, కేఏ పాల్, హీరోలు చిరంజీవి, వెంకటేశ్, నాగ చైతన్య, జూ.ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్, ప్రభాస్, రానా, జీవిత, రాజశేఖర్, మురళీమోహన్, విజయ్ దేవరకొండ, మంచు విష్ణు, అఖిల్, ఆర్.నారాయణమూర్తి, నరేశ్, పవిత్ర లోకేశ్, దర్శకులు రాఘవేంద్రరావు, త్రివిక్రమ్, నటులు నాగ బాబు, సుధీర్‌బాబు, సత్యదేవ్, రఘుబాబు, బాబూ మోహన్, అడివి శేష్, రఘుబాబు, సంగీత దర్శకులు కీరవాణి, తమన్, నిర్మాతలు సుబ్బిరామిరెడ్డి , దిల్ రాజు, కృష్ణ సోదరుడు, నిర్మాత ఆదిశేషగిరిరావు తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. మహేష్ బాబును పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సీఎం కేసీఆర్ సంతాపం: సూపర్ స్టార్ భౌతిక కాయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ సందర్శించి పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. కృష్ణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయనతో పాటు మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్, ఎంపీ.సంతోష్ తదితరులు ఉన్నారు. అలాగే రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇతర మంత్రులు, బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత జానారెడ్డి , టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు, సినీ, రాజకీయ ప్రముఖులు తదితరులు నివాళులర్పించారు. ప్రధాని నరేంద్రమోదీ ట్విట్టర్ వేదికగా కృష్ణ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి బుధవారం కృష్ణ అంత్యక్రియల్లో పాల్గొననున్నారు.

ప్రజానాట్యమండలి సంతాపం: అనేక సందేశాత్మక, అభ్యుదయ చిత్రాలను నిర్మించి, నటించిన ప్రముఖ సినీనటుడు కృష్ణ మృతి కళారంగానికి తీరనిలోటుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రానాయక్, పెంచలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణ మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

నేడు సినీ పరిశ్రమ బంద్: 2022 సంవత్సరం ఘట్టమనేని కుటుంబానికి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఏడాది ఆరంభంలోనే కృష్ణ పెద్ద కొడుకు, నటుడు రమేష్ బాబు కన్నుమూశారు. అన్నను పోగొట్టుకున్న మహేశ్ బాబు ఆ బాధ నుంచి కోలుకునే లోపే ఆయన తల్లి ఇందిరా దేవి సెప్టెంబర్ 28న అనారోగ్యంతో చనిపోయారు. అదిజరిగిన రెండు నెలల్లోనే కృష్ణ మరణం ఆ కుటుంబాన్ని మరింత విషాదంలోకి నెట్టేసింది. ఏడాది వ్యవధిలోనే ముగ్గురు మరణించడం ఆ కుటుంబానికి తీరని శోకం మిగిల్చింది. సూపర్‌స్టార్ కృష్ణ మృతికి సంతాపంగా బుధవారం తెలుగు సినిమా పరిశ్రమ బంద్ పాటించాలని ప్రొడ్యూసర్ కౌన్సిల్ పిలుపునిచ్చింది.

సంస్మరణ సభ



(C.P.I.) (C.P.I.)

కామ్రేడ్ కామినేని భాస్కరరావు గారు
సీనియర్ కమ్యూనిస్టు నాయకులు
మరణం 06-11-2022

మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలచి, మా ఉన్నతికి అహర్నిశలు కృషిచేసి, మా అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించిన మీరు మా నుండి భౌతికంగా దూరమైననూ మీ మధుర స్మృతులు నిత్యం గుర్తుంటాయి.

భార్య : కామినేని సామ్రాజ్యం

కుమారులు - కోడళ్ళు
కామినేని శ్రీనివాసరావు - పద్మావతి
కామినేని స్టాలిన్ - ఝాన్సీరాణి
కామినేని సుధాకర్‌బాబు (లేటు) - రమణి
కామినేని శ్రీకృష్ణ (లేటు) - కల్పన

కుమార్తెలు :
శాంతకుమారి
కోటేశ్వరి
పార్వతి

మనుమలు, మనుమరాండ్రు & కుటుంబ సభ్యులు

సంస్మరణ సభ : ది. 16-11-2022 బుధవారం ఉ॥ 10:00 గం॥లకు దుగ్గిరాల మం॥ తుమ్మపూడి గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.